నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
అనంతపురం | శ్రీ సత్యసాయి
బుధవారం | 24 జూలై 2024 | పేజీలు 10

కంపెనీ పేరుతో

పట్టించుకోని అధికారులు

## నకిలీ కూల్‌డ్రింక్స్ అమ్మకం





అనుమతులు లేకుండా యథేచ్ఛగా జిల్లాలో వ్యాపారం

- డిస్ట్రిబ్యూటర్ పాయింట్‌ను టచ్ చేస్తే పోలీసు శాఖ నుంచి కాల్స్
- చోద్యం చూస్తున్న వైనం

**అనంతపురం, మేజర్ న్యూస్**

అనంతపురం జిల్లాలో నూతన వ్యాపారానికి ఓ మహానుభావుడు తెరలేపాడు. వేరే రాష్ట్రంలో ఉన్న కూల్ డ్రింక్‌ను అనంతపురం జిల్లాలో యథేచ్ఛగా అమ్ముకుంటూ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరుకాయలుగా నిర్వహిస్తున్నాడు. అధికారుల కంట పడకుండా, ఎలాంటి అనుమతులు లేకపోయినా ఆయన వ్యాపారం సాఫీగా సాగిపోతోంది. అతని వ్యాపార సముదాయానికి సంబంధించి ఎవరన్నా టచ్ చేస్తే పోలీసు శాఖ నుంచి కాల్స్ వస్తున్నాయంటూ తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## ప్రభుత్వం మారినా పేర్లు మారవా..?




ప్రజాధనంతో నిర్మాణం.. వారి పేర్లు ఏంటి..!

అయినా అధికారుల్లో రాని మార్పు

**బత్తలపల్లి మేజర్ న్యూస్:**

బత్తలపల్లి మండలంలో సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు, లైబ్రరీలు ఇలా ప్రజలకు కావాల్సిన భవనాలను నిర్మించడం మంచిదే అయితే వాటికి ప్రతి భవనానికి కూడా తన తండ్రి పేరు పెట్టడం విడ్డూరం వీటిపై ప్రజలు విమర్శలు గుప్పించారు.

### ప్రజాధనంతో నిర్మాణం

రాష్ట్రవ్యాప్తంగా కూడా ప్రజాధనంతో భవనాలు నిర్మించారు. వాటికి స్వాతంత్ర సమరయోధులు, దేశ నాయకుల పేర్లు పెట్టాలి కానీ గత పాలకులు వైయస్సార్ ఆరోగ్య కేంద్రం, వైయస్సార్ రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ డిజిటల్ లైబ్రరీ ఇలా ప్రతిభవనానికి కూడా ముందుగా వైయస్సార్ పేరుని పెట్టి భవనాలకు అదే రకానికి చెందిన రంగులు కూడా వేయించారు. మొన్న ఎన్నికల నియమావళి ఉన్నప్పుడు కూడా అధికారులు పేర్లు మార్చాల్సింది పోయి అలాగే ఉంచడంతో మండిపడుతున్నారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం పేర్లు మార్పుపై ఆయా శాఖలకు జీవో జారీ చేసింది. కానీ స్థానిక అధికారులు నిర్లక్ష్యంతో అదే గతంలో ఉన్న పేర్లని కొనసాగించడంతో ఏమిటి ఈ విడ్డూరం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం బత్తలపల్లిలోని రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రంలో సూచిక బోర్డు, గరిశనపల్లెలో లైబ్రరీ, ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి భవనానికి ప్రతి కార్యక్రమానికి బోర్డులను ఏర్పాటు చేసి అలాగే ఉంచారు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు అయినప్పటికీ కూడా స్థానిక అధికారులు అదే గతంలో ఉన్న పేర్లను మార్చకపోవడంతో ప్రజలు విమర్శలు చేస్తున్నారు. పేర్లు మార్పు పై అధికారుల దృష్టికి ప్రజలు పలుసార్లు తీసుకువెళ్లిన మార్పు

మిగతా 2లో

**గత ప్రభుత్వం అధికారమదంతో భవనాలు నిర్మించింది. అయితే వాటికి తనకు నచ్చిన పేర్లను పెట్టి ఆ భవనాలు ఈ భవనాలు అంటూ.. పేర్లు పెట్టి రంగులు కూడా వేయడం విడ్డూరంగా ఉంది. అయితే ప్రస్తుతం ప్రభుత్వం మారినా కూడా ఆ భవనాలకు కనీసం అధికారులు పేర్లు కూడా మార్పు చేయకపోవడంతో అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు.**





## డాక్టర్ల క్వార్టర్స్‌ను పరిశుభ్రంగా ఉంచాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్**

నగరంలోని డాక్టర్స్ క్వార్టర్స్ ని పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నగరంలోని జీసెస్ నగర్ వద్దనున్న డాక్టర్స్ క్వార్టర్స్ ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్స్ క్వార్టర్స్ లో శానిటేషన్ మరింత మెరుగు పరచాలన్నారు. క్వార్టర్స్ నుంచి డ్రైనేజీని మెయిన్ డ్రైనేజీలోకి కలిపేలా చూడాలన్నారు. డాక్టర్స్ క్వార్టర్స్ లోకి ఇతరులు ఎవరు ప్రవేశించకుండా చూసుకోవాలన్నారు. క్వార్టర్స్ మెయిన్ గేట్ మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్వార్టర్స్ లో అవసరమైన పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర రావు, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యరావు, డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



నగరంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ నెం.4లో పాచిపట్టిన తొట్టెలో నిల్వ ఉన్న నీరు

## పరిశుభ్రత అంటే ఇలాగేనా?

### పాచిపట్టిన తొట్టిలోని నీరే హాస్టల్ విద్యార్థులు వాడుకోవాల్సిన దుస్థితి

**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** నగరంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ నెం.4లో మరుగుదొడ్లు నిర్వహణలో కనీస శుభ్రత పాటించడం లేదు. ఇక్కడ నీటి తొట్టె పాచిపట్టి అపరిశుభ్రంగా ఉంటూ వాసన వస్తున్నా సంబంధిత హాస్టల్ వార్డెన్ కాని, సిబ్బంది అటు వైపు తొంగి చూడలేదా, లేక చూసినా పట్టించుకోలేదో వారికే తెలియాలి. హాస్టల్‌కు సమయానికి రావడం వెళ్లిపోవడం తప్ప పరిసరాల పరిశుభ్రతపై పట్టించుకోలేదని ఈ చిత్రాన్ని చూస్తే తెలిసిపోతుంది. జిల్లా కలెక్టర్, సాంఘిక శాఖ ఉన్నతాధికారులు హాస్టళ్ల సందర్శనలోనూ, సమావేశాల్లో

మిగతా 3లో

## రాక్రీట్ సంస్థ అక్రమాలపై విచారణ జరిపించండి

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇళ్ల నిర్మాణాలపై రాక్రీట్ సంస్థ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిందని.. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి ఫిర్యాదు చేశారు.



ముఖ్యమంత్రిని కలిసి సమస్యలను వివరిస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

### ఇళ్ల నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగింది

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత
- పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి
- పేరూరు ప్రాజెక్టు గేట్ల మరమ్మతులకు నిధులు కేటాయింపులపై వినతి
- ముఖ్యమంత్రితో పాటు సంబంధిత శాఖల మంత్రులను కలిసిన సునీత

**అనంతపురం, మేజర్ న్యూస్ :**

మంగళవారం ఆమె సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లి అన్ని అంశాలను వివరించారు. అలాగే గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథిని కలిసి జగనన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రాక్రీట్ సంస్థ పేరుతో అప్పటి ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి కాంట్రాక్టు తీసుకున్నారని.. అయితే ఇళ్ల నిర్మాణాలు చేయకుండా 2వందల కోట్ల రూపాయల మేర డబ్బులు కాజేసి.. ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదన్నారు. రాష్ట్రంలో మొత్తం 3.15 లక్షల జగనన్న ఇళ్లలో 63 వేలు రాక్రీట్ సంస్థకే కేటాయించగా.. అనంతపురం, శ్రీసత్యసాయి, వైయస్ఆర్, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, విజయనగరం, విశాఖ జిల్లా ల్లోని గృహ నిర్మాణ పనులు అప్పగించారన్నారు. రూ.10 లక్షలకు మించిన పనులకు టెండరు విధానాన్ని పాటించాలని నిబంధనలు చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రూ.1,100 కోట్ల విలువైన పేదల ఇళ్ల నిర్మాణాన్ని వైకాపా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి బంధువు, అనుచరవర్గం డైరెక్టర్లుగా ఉన్న గుత్తేదారు సంస్థ రాక్రీట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ అండ్ లాజిస్టిక్ ప్రైవేటు లిమిటెడ్ వారికి నిబంధనలను కాదని కట్టబెట్టారు. పనులు తీసుకున్నాక.. అవి కూడా

మిగతా 4లో

## వెంకటాద్రిపల్లిలో ప్రగతి ఎఫ్‌పిఓ
# మూడవ వార్షిక మహాసభ



బెలుగుప్ప, మేజర్ న్యూస్ : మండల పరిధిలోని వెంకటాద్రిపల్లి గ్రామంలో ప్రగతి ఎఫ్‌పిఓ మూడవ వార్షిక మహాసభ ఎఎఫ్ ఎకాలజీ ఫీల్డ్ నందు మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యమానికి ఎఎఫ్ ఎకాలజీ సెంట్రల్ ఆఫీస్ ఎఫ్‌పిఓ టీం లీడర్ ఆర్డినేటర్ రిజ్వానా, ఎఫ్‌పిఓ టీం లీడర్ శంకర నాయక్ పాల్గొని అనంతరం మాట్లాడుతూ ప్రగతి ఎఫ్‌పిఓ అనేది నాబార్డ్ సహకారంతో ఎఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసుకున్న ఒక సామాజిక వ్యాపారం సంస్థ. ప్రగతి ఎఫ్‌పిఓ ముఖ్య ఉద్దేశం ఏమిటంటే 'రైతులు వ్యవసాయం మీద చేసే ఖర్చు సాధ్యమైనంత వరకు తగ్గించడం, రైతుకు ఏదైతే ఆదాయం వస్తుందో దానికి అదనపు ఆదాయం వచ్చే విధంగా చేయడం అని తెలపడం జరిగింది. అదే విధంగా రైతులు దళారులు, మరియు మధ్యవర్తులు చేతిలో దోపిడీకి గురికాకుండా, వారు పండించిన పంట నేరుగా రైతు సంఘంకి అమ్ముకొనేందుకు ఏర్పాటు చేసిన సంస్థే ప్రగతి ఎఫ్‌పిఓ అని, అదేవిధంగా ఆవు పులి అనే నీతి కథ ద్వార రైతు సంఘం గురుంచి రైతులకు తెలియచేయడం జరిగింది, ముఖ్యంగా గత సంవత్సరం వేరుశెనగ అమ్మిన రైతులకు బోనస్ కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు.

# కేంద్ర బడ్జెట్లో ఏపీకి ప్రాధాన్యత..
## నిర్మల సీతారామన్ బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం...
### జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్



**అనంతపురం విద్య మేజర్ న్యూస్:** కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు ప్రాధాన్యత లభించడం శుభ పరిణామమని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్ అన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో అమరావతికి పోలవరానికి నిధులు ఇవ్వడంతో పాటు రాయలసీమ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొనడం హర్షణీయ మన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి ఫలితంగానే ఆంధ్రప్రదేశ్కు కేంద్ర బడ్జెట్లో ప్రాధాన్యత లభించిందని పత్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. డబల్ ఇంజన్ సర్కార్తో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందన్నారు.

# ప్రత్యేక అలంకరణతో ముత్యాలమ్మవ్వ
## మంగళవారం అమ్మవారికి విశేష పూజలు



**గార్లదిన్నె మేజర్ న్యూస్ :** గుంతకల్ జి. కొట్టాల గ్రామం లోని ముత్యాలమ్మపేటలో కొలువుదీరిన ముత్యాలమ్మవ్వ అమ్మవారిఆలయంలో మంగళవారం అమ్మవారిని భక్తులు ప్రత్యేకంగా పూలతో సుందరంగా అలంకరించారు. ఆలయ పరిసరాలు కూడా పూలతో అలంకరించడం తో చూపరులను కనువిందు చేసింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానపూజారి ముత్యాల గంగరాజు స్వామి ఆధ్వర్యంలో ఉదయం నుంచి అమ్మవారికి మంగళ హారతి, నైవేద్యం తదితర పూజలు నిర్వహించారు.

# ప్రభుత్వం మారినా పేర్లు మారవా.?

▸▸ మొదటి పేజీ తరువాయి

చెందకపోవడం మార్పు రాలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు తరువాత రైతు భరోసా కేంద్రాలకు రైతు సేవా కేంద్రాలుగా మారుస్తూ వ్యవసాయశాఖ ఉత్తర్వులు విడుదల చేసినప్పటికీ అధికారులలో మాత్రం చలనం రాలేదు. బత్తలపల్లి ఆరోగ్య కేంద్రంలో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య సేవలకు సంబంధించిన పట్టిక లో ఇప్పటికీ జగన్ మోహన్ రెడ్డి ఫోటోతో ఉన్న పట్టికను ప్రదర్శించడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారో లేదో వేచి చూద్దాం?




# సాఫ్ట్‌బాల్ జిల్లా బాల బాలికల జట్ల ఎంపిక

**అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ :** అనంతపురం ఆర్డిటి క్రీడా మైదానంలో మంగళవారం జిల్లా సాఫ్ట్ బాల్ జూనియర్ సీనియర్ బాలబాలికల జట్లను ఎంపిక చేశారు ఎంపిక పోటీలకు జిల్లా నుంచి దాదాపు 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాఫ్ట్బాల్ సంఘం ఏపీ సీఈఓ సి.వెంకటేసులు మాట్లాడుతూ సీనియర్ సాఫ్ట్బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆగస్టు 10, 11, 12 గుంటూరు జిల్లా వినుకొండలో, జూనియర్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్బాల్ పోటీలు ఆగస్టు 17, 18, 19 తేదీలలో శ్రీకాకుళంలో నిర్వహిస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులకు ఆగస్టు 1వ తేదీ నుండి సన్నాహక శిక్షణ శిబిరం ఉంటుందని ప్రతి క్రీడాకారుడు సద్వినియోగం చేసుకొని రాష్ట్రస్థాయి పోటీలలో మన అనంతపురం జిల్లా జట్టు గెలుపుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగేంద్ర, పీడీలు రామకృష్ణ, బొగ్గు ప్రభాకర్, గోపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, సంజీవులు, చంద్ర, లతాదేవితోపాటు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

**ఎంపికైన జట్టు క్రీడాకారుల వివరాలు**

**సీనియర్ బాలురు జట్టు :** మహేష్, వరుణ్ కుమార్, అక్షయ్ సాగర్,



పృథ్వీరాజ్, శివకుమార్, సింహాద్రి, లక్ష్మీనారాయణ, వినోద్, లక్ష్మీకళ్యాణ్, తరుణ్ సాయి, సుశాంత్, అరవింద్, ధనుష్, అబ్దుల్ ఖాదర్, షాకీర్, నవీన్ కుమార్.

**సీనియర్ బాలికల జట్టు :** లావణ్య, లక్ష్మి, స్రవంతి, ధరణి, ఖ్యాతి, గౌరీ, మౌనిక, శిరీష, అమీదా, బసంతి, ఫాతిమా, నాగప్రసన్న, సుకన్య, నిహారిక, ప్రశాంతి, జ్యోతి.

**జూనియర్ బాలుర జట్టు వివరాలు :** అరవింద్ రెడ్డి, చరణ్ తేజ్, గణేష్, వసంత్ కుమార్, సాయి వెంకట్, అజయ్, చరణ్, జగదీష్, హేమచంద్ర, సురేష్, నాని, శశిధర్ కుమార్, మున్నా, సతీష్, మోక్షిత్ వర్మ, భానుశంకర్.

**జూనియర్ బాలికల జట్టు వివరాలు :** చంద్ర, సరోజ, ఆశ, లక్ష్మి, శ్రావణి, శృతి, పల్లవి, హాసిని, మీనా, ఉష, పల్లవి, సుజన్, రోహిణి, సుప్రియ, జాహ్నవి, చంద్ర, నిఖిల.

# ఉద్యోగులను నిరాశ పరచిన కేంద్ర బడ్జెట్
## ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయ్ భాస్కర్



**అనంతపురం విద్య మేజర్ న్యూస్:** కేంద్ర ప్రభుత్వం మంగళ వారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉద్యోగులను తీవ్ర నిరాశ పరచిందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నూతన పెన్షన్ విధానం లో మార్పుల దిశ గా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందనే ప్రచారం ఒకవైపు జరుపుతూ ప్రస్తుతం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ లో పాత పెన్షన్ ప్రస్తావన లేకపోవడం సరైనది కాదని విమర్శించారు. ఉద్యోగుల ఇన్కమ్ టాక్స్ కు సంబంధించిన పాత రెజీమ్ లో ఎటువంటి మార్పులు చేయకుండా కేవలం కొత్త రెజీమ్ లో మార్పులు చేసారని అన్నారు. పాత విధానం లో పన్నులు చెల్లించే ఉద్యోగులకు రాయితీ ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగులు తీవ్ర నిరాశ కు గురి అయ్యారని అన్నారు. ఉద్యోగులకు పాతపన్నుల విధానంలో 3 లక్షలు కాకుండా 7 లక్షల వరకు ఎటువంటి పన్ను లేకుండా మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్టాండర్డ్ డిడక్షన్ లక్ష రూపాయలు పెంచితే ఉద్యోగులకు మేలు జరుగుతుందన్నారు.

# ఎపి జిఎల్ఐసి డిప్యూటీ డైరెక్టర్ భాస్కర్ తేజనాథ్‌ను కలిసిన ఎస్‌టియు నాయకులు



**అనంతపురం విద్య మేజర్ న్యూస్ :** జిల్లా లోని ఉపాధ్యాయులు ఉద్యోగుల ఎ పి జి ఎల్ ఐ సి సమస్యలపై 16 న వినతి పత్రం ఇచ్చిన సందర్భ గా డి డి భాస్కర్ తేజనాథ్ మంగళవారం ఎస్ టి యు జిల్లా నాయకులతో సమావేశమయ్యారు. ఎ పి జి ఎల్ ఐ సి ఫైనల్ పేమెంట్లు ,లోన్లు, మిస్సింగ్స్ క్రెడిట్స్, డెత్ క్లెయిమ్స్ ఇది వరకే అప్లై చేసి న అన్ని బాండ్ ల క్లెయిమ్స్ ను పరిష్కరించాలని డి డి తో ఎస్ టి యు నాయకులు చర్చించారు. డి డి అన్ని అంశాలను సానుకూలంగా విని వెంటనే తన వరకు వచ్చిన అన్ని అంశాలను పరిష్కరించానని, ఇక మీదట కూడా తన దృష్టికి వచ్చిన అన్ని అంశాలను వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు.అనంతపురము జిల్లా లో కార్యాలయ సిబ్బంది తక్కువగా ఉన్నారని పని వత్తిడి ఉన్నదని ప్రత్యేకంగా రాష్ట్ర నాయకులతో మాట్లాడి స్టాఫ్ ను కేటాయించుటకు చొరవ చూపాలన్నారు.ఈ కార్యక్రమములో ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు ఎన్ రమణా రెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ రామాంజనేయులు, రాష్ట్ర అదనపుకార్యదర్శి జి సూర్యుడు, రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణ మోహన్,ఫణి భూషణ్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి వి రాజశేఖర్, జిల్లా నాయకులు నాగభూషన, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో, ఏపీకి నిధుల పట్ల బిజెపి హర్షం



**కుందుర్పి, మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు 15వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించడం పట్ల మండలం బిజెపి శాఖ అధ్యక్షుడు సజ్జల వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మధ్యతర బడ్జెట్లో ఆంధ్రప్ర దేశ్‌కు కేటాయింపులలో భాగంగా అమరావతికి రూ.15వేలకోట్ల ప్రత్యేక సాయంతో ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అమరావతి అభివృద్ధికి 15 వేలకోట్లు ప్రత్యేక సాయం, అవసరాన్ని బట్టి అమరావతికి మరిన్ని నిధులు, పోలవరానికి పెద్దపీట త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషిచేయడంపై అభినందనలు తెలిపారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్రజిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు, విశాఖ- చెన్నై కారిడార్లో కొప్పర్తికి, హైదరాబాద్, బెంగళూరు కారిడార్లో ఓర్వకల్లుకు నిధులు కేటాయించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కుందుర్పి మండల శాఖ తరుపున ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రనిధులను తీసుకురావడం లో కీలకపాత్ర పోషించిన రాష్ట్రవైద్య, ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ కృషికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా... ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృషి
### ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షులు వసికేరి మహేష్



**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ కృషి చేస్తారని ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షులు వశీకేరి మహేష్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంతకల్లు తాలూకా ప్రెసిడెంట్ వరప్రసాద్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. తాలూకా అధ్యక్షులు వశీకేరి మహేష్ మాట్లాడుతూ ఈ నెల (జూలై) 28న అనంతపురం జిల్లా కేంద్రంగా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే.ఆర్. సూర్యనారాయణ అధ్యక్షతన సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కార కార్యాచరణ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రమోషన్ ఛానల్, పే స్కేల్ సంబంధిత అంశాల సాధనకు అవసరమైన ముందస్తు ప్రణాళిక పట్ల చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి అన్ని విధాల న్యాయం జరిగే విధంగా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం భవిష్యత్తులో అండగా నిలుస్తుందని సంఘం ప్రతినిధులు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా వైస్ ప్రెసిడెంట్ బాల వెంకటేష్, కమిటీ సభ్యులు మల్లికార్జున, విశ్వనాథ్, అహ్మద్, విజయ్, షఫీ, హనుమంత్ రెడ్డి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో గెస్ట్ ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

### ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ ఏ.మురళీకృష్ణ

**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** ఉమ్మడి జిల్లాల్లోని ఆంధ్ర ప్రదేశ్ సాంఘిక సంక్షేమ, అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్య సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను భర్తీ చేయనున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్ ఏ.మురళీ కృష్ణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పాఠశాలల వారీగా ఖాళీ పోస్టుల వివరాలను ఆయన ప్రకటించారు. మలుగూరు (బాలుర) పాఠశాలలో టీజీటీ హిందీ, పీజీటి ఇంగ్లీష్, పీఈటి, తిమ్మాపురం బాలికల పాఠశాలలో - టీజీటీ - సైన్స్, టీజీటీ - గణితం, పీజీటి- గణితం, పీజిటి - జీవశాస్త్రం, పీడీ, కణేకల్ బాలుర పాఠశాలలో - జే.ఎల్- గణితం, నల్లమాడ బాలికల పాఠశాలలో - టీజీటీ- ఫిజికల్ సైన్స్, టీజీటీ హిందీ, జే. ఎల్-ఇంగ్లీష్, జే.ఎల్- హిస్టరీ,పీఈటి, బి. పప్పూరు బాలుర పాఠశాలలో టీజీటీ ఫిజికల్ సైన్స్, టీజీటీ -హిందీ, అమరాపురం బాలికల పాఠశాలలో టీజీటీ - హిందీ, టీజీటీ సోషల్, పీజిటి - ఇంగ్లీష్, పీజిటి - గణితం, హిందూపూర్ బాలికల పాఠశాలలో - టీజీటీ - ఫిజికల్ సైన్స్, రొళ్ల బాలుర పాఠశాలలో - టీజీటీ - ఫిజికల్ సైన్స్, హిందూపూర్ ( బాలురు) - టీజీటీ - ఫిజికల్ సైన్స్, టీజీటీ - జీవశాస్త్రం, టీజీటీ -హిందీ, పీజీటీ - ఇంగ్లీష్ సబ్జెక్టులకు గెస్ట్ ఉపాధ్యాయ పోస్టుల కోసం ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు.టీజీటీ పోస్టుకు డిగ్రీ, బీఎడ్, టెట్, పీజీటీ పోస్టుకు పీజీ, బీఎడ్, టెట్, పీఈటి, పీడీ పోస్టులకు బీపీడీ అర్హతలని ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో టీచింగ్ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల వారు, తమ అన్నీ సర్టిఫికెట్స్‌లతో ఈనెల 26న కురుగుంట గురుకుల పాఠశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. బాలుర పాఠశాలలకు పురుష అభ్యర్థులు, బాలికల పాఠశాల కు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని సమన్వయ అధికారి మురళీకృష్ణ తెలిపారు.

## ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఐశ్వర్యవంతుడు కాదు...

### ఉద్యోగుల 12 నెలల కష్టానికి ప్రతిఫలం 11 నెలల జీతమే...

### ఉద్యోగులకు వ్యతిరేకంగా.. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు..: నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**అనంతపురం విద్య మేజర్ న్యూస్ :** గత పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల పట్ల మరియు వేతన జీవుల పట్ల ఎలాంటి కనికరం లేకుండా కఠినంగా వ్యవహరిస్తుందని ఈ ప్రభుత్వాలు కార్పొరేట్లకు అనుకూలంగా వేతన జీవులకు వ్యతిరేకంగా ఉన్నాయనేలా వ్యవహరిస్తున్నాయని వేతనజీవిల తన 12 నెలల కష్టం 11 నెలల జీతంతో సరిపెట్టే లా కేంద్ర ప్రభుత్వ ఆదాయ పన్ను విధానాలు ఉన్నాయని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ మరియు మాగంటి శ్రీనివాసరావులు ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఐశ్వర్యవంతుడు కాదనే సత్యాన్ని ఎప్పుడు పాలకులు తెలుసుకుం టారో అర్థం కావట్లేదని, పేదరికంలో పుట్టి ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రభుత్వ ఉద్యోగం సంపాదిస్తే సొంతంగా ఇంటిని నిర్మించుకోవడానికి కూడా ప్రభుత్వం సహకారం ఉండట్లేదన్నారు. ఆదాయపు పన్ను నుంచి వెసులుబాటు కల్పించకపోవడం బాధాకర మని అన్నారు. పాత పన్ను స్లాబుల్లో ఎలాంటి మార్పులు లేకుండా ఉండటం అంటే సిపిఎస్ ఉద్యోగులకు తీరని అన్యాయం జరిగినట్లేనన్నారు. 10 సంవత్సరాల క్రితం సిపిఎస్ ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ లో 50 వేల వరకు పన్ను మినహాయింపు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు అది కూడా లేకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ఆదాయ పన్ను విధానాన్ని చూస్తే ఉద్యోగులందరూ తాము సంపాదించి న మూడు లక్షల తదుపరి ప్రతి రూపాయికి పన్ను చెల్లించాలి అనేట్లుగా ఉందని ఇది విచారకరమన్నారు. ప్రతి ఉద్యోగి తన జీవితంలో ప్రతినెల 10 శాతంప్రత్యక్ష పన్నుగా చెల్లించాల్సి వస్తుందని, అదే సిపిఎస్ ఉద్యోగి అయితే తన కాంట్రిబ్యూషన్ తో పాటు సుమారుగా 20 శాతం తిరిగి చెల్లించాల్సి వస్తుందని విచారం వ్యక్తం చేశారు. ప్రతి ఉద్యోగికి ఉండటానికి ఒక గృహము తన పిల్లల చదువు కు అయ్యే ఖర్చు తన సంపాదనలో అధిక శాతం ఉంటుందని కుటుంబ ఖర్చులు పోను పై వాటికి మినహాయిస్తే ఉద్యోగికి మిగిలేది ఏమీ లేదని పేర్కొన్నారు. సిపిఎస్ ఉద్యోగులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన ఈ బడ్జెట్లో ఎలాంటి ఊరట లేదని, కనీస పెన్షన్ ,ఆసరా పెన్షన్ కంటే తక్కువగా వస్తుంటే ఆ పెన్షన్ కోసం తన కాంట్రిబ్యూషన్ గా 10 శాతం ప్రతినెలా ప్రభుత్వానికి తిరిగి చెల్లించాల్సిన అవసరం ఏంటో అర్థం కావట్లేదని ప్రతి ఉద్యోగి భావిస్తున్నారని అన్నారు. సామాన్య ఉద్యోగులు గురించి గత పది సంవత్సరాల నుంచి ఈ ప్రభుత్వం కనీసం ఆలోచన కూడా చేయలేదని విచారం వ్యక్తం చేశారు.

## చాకలి ఐలమ్మ కాలనీలో ఘనంగా గంగమ్మ జాతర



**అనంతపురం రూరల్ మేజర్ న్యూస్:** నగర శివారులోని చాకలి ఐలమ్మ కాలనీలో గంగమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాలనీలో ప్రతి సంవత్సరం కూడా ఆషాఢ మాసంలో గంగమ్మ జాతర నిర్వహించుకుంటూ ప్రతి ఒక్క ఇంటి నుంచి బోనాలు తీసుకొని గంగమ్మ కి సమర్పించడం ఆనవాయితీగా జరుగుతుందని రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి లింగమయ్య తెలిపారు. జిల్లాలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం గంగమ్మ జంతుబలులు సమర్పించారు. గంగమ్మ జాతరను సంతోషంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి సివి హరి కృష్ణ, సివి లలిత, నాగప్ప ,పెద్దలు నాగరాజు, పెయింటర్ భూషణ ,వీరాంజి ,ఈశ్వరమ్మ, శోభ, లక్ష్మీనారాయణ ,సంజీవులు, శీన,ఆటో ఆదినారాయణ, ఓబులేసు, రామకృష్ణ ,మారుతి, లడ్డు నరేష్ ,నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



నింబగల్లు హెచ్ఎల్సి హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న దుస్థితి



గడ్డి, పూడికతో దర్శనమిస్తున్న గుంతకల్లు బ్రాంచ్ కెనాల్

### తుంగభద్ర జలాల ప్రవాహానికి...

# అడుగడుగునా అడ్డంకులే!!

### శిథిలావస్థకు చేరుకున్న షట్టర్లు..

### గడ్డి, పూడికతో నిండిపోయిన గుంతకల్లు బ్రాంచ్ కెనాల్

**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** తుంగభద్ర జలాలు ప్రవహించే హెచ్ ఎల్ సి ప్రధాన కాలువ తో పాటు గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ లో అడుగడుగునా నీటి ప్రవాహానికి అడ్డంకులు నెలకొన్నాయి. వైకాపా ప్రభుత్వం గత ఐదేళ్ల పాలనలో హెచ్ఎల్సి నిర్వహణపై తీవ్రమైన నిర్లక్ష్యం చూపడంతో నీటి ప్రవాహం ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే హెచ్ఎల్సి ప్రధాన కాలువకు 500క్యూసెక్కుల తుంగభద్ర జలాలను మళ్లించారు. ఈ నెల 30వ తేదీ వరకు కనేకల్ చెరువుకు జలాలను మళ్లించి, తరువాత అక్కడి నుంచి గుంతకల్ బ్రాంచ్ కెనాల్, పీఏబీఆర్ కు నీటి సరఫరా చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్ ఎల్ సి కి విడుదల కానున్న నీటిని మొదటి ప్రాధాన్యత కింద తాగు నీటి అవసరాలు, వరి నార్లు పోసుకోవడానికి మాత్రమే వినియోగించనున్నారు.మండలంలోని నింబగల్ హెడ్ రెగ్యులేటర్ వద్ద ఉన్న జిబిసి 0/0 కిలోమీటర్ వద్ద నుంచి 58.5కిలోమీటర్ పొడవునా విస్తరించి ఉంది. జిబిసి కింద 15.752 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇప్పటికే నియోజకవర్గంలో ని గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు పూర్తిగా ఎండిపోయిన పరిస్థితి. ఇలాంటి తరుణంలో హెచ్ఎల్సి ప్రధాన కాలువకు తుంగభద్ర జలాలను మళ్లించడంతో నియోజకవర్గ ప్రజల్లో సాగు, తాగునీటి అవసరాలు తీరనున్నాయన్న సంతృప్తి వ్యక్తం అవుతోంది. హెచ్.ఎల్.సి ప్రధాన కాలువతోపాటు గుంతకల్ బ్రాంచ్ కెనాల్ లో అడుగడుగునా అడ్డంకులు నెలకొనడంతో కాలువలో నీటి ప్రవాహం సాఫీగా సాగడం ప్రశ్నార్థకంగా మారింది. ఉపాధి నిధులు ఉపయోగించి అత్యవసరమైన పనులు చేపట్టాలని అధికారులు ఆదేశించినా ఆదిశగా క్షేత్రస్థాయిలో పనులు జరగలేదు. తూతూ మంత్రంగా మట్టి పనులు చేసి వదిలేశారు. నింబగల వద్ద తుంగభద్ర ఎగువ కాలువ రెగ్యులేటర్, గుంతకల్లు బ్రాంచ్ కాలువ షెటర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలువ వెంబడి గడ్డి, పూడిక పేరుకుపోయి, అక్కడక్కడ కాలువలో కంప చెట్లు అడ్డంకిగా దర్శనమిస్తున్నాయి. గుంతకల్లు బ్రాంచ్ కాలువ పూడిక, గడ్డితో నిండి కాలువ పొడవున కంపచెట్లు నిండిపోయాయి. దీంతో తుంగభద్ర జలాలు చివరి ఆయకట్టుకు చేరడం గగనమేనని ఆయుకట్టు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మోపిడి గ్రామం వద్ద ఉన్న తుంగభద్ర ఎగువ కాలువలోని 189వ కిలోమీటర్ వద్ద ఉన్న మోపిడి లింక్ ఛానల్ వంతెన కుప్పకూలి నాలుగేళ్లు గడిచిపోయింది. హెచ్ఎల్సి అధికారులు వంతెన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టలేదని రైతులు వాపోతున్నారు. జిల్లాకు కేటాయించిన తుంగభద్ర జలాలను వాటాను హెచ్ఎల్సి అధికారులు ఎంత వరకు వినియోగంలోకి తేనున్నారో వేచి చూడాల్సిందే.

## పరిశుభ్రత అంటే ఇలాగేనా ?

▸▸ మొదటి పేజీ తరువాయి

పదే పదే సంక్షేమ హాస్టళ్ల ను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెబుతున్నారు. వారి ఆదేశాలను సంబంధిత వార్డెన్ ఏ మాత్రం పాటిస్తున్నారో అక్కడ పాచిపట్టిన తొట్టెను చూస్తే అర్థమవుతుంది. దుర్వాసన వస్తున్నా ఆ పాచిపట్టిన తొట్టెలోని నీటినే గత్యం తరం లేని పరిస్థితుల్లో విద్యార్థులు వాడుకుంటున్నారు. మరుగుదొడ్ల మరమ్మత్తులకు నిధులు లేవని వార్డెన్లు చెబుతున్నారు. కనీసం మరుగుదొడ్ల వద్ద ఉన్న తొట్టెలోని పాచినీ తొలగించుకోలేని పరిస్థితు ల్లో ఉన్నారనేది, ఇక్కడ చూస్తే అర్థమవుతోంది. అసలే వర్షాకాలం కావడంతో పరిశుభ్రత లేకపోతే విద్యార్థులు విషజ్వరాల భారిన పడే ప్రమాదముంది. మరి ఇలా పరిశుభ్రత పాటించకపోతే ఎలా ? హాస్టల్ పరిసరాలు ఇలా ఉంటే విద్యార్థులు అనారోగ్యాలు కొని తెచ్చుకోవా ల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పర్యవేక్షించాల్సిన సంబంధిత డివిజన్ అధికారి ఇలాంటివి పరిశీలించరా ? కేవలం హాస్టల్‌కు అలా వచ్చి చూసుకుని వెళ్తుతారన్న అనుమానాలు దీన్ని బట్టి చూస్తే అర్థమవుతుంది. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు స్పందించి హాస్టల్ పరిసరాల శుభ్రంగా ఉంచేలా వార్డెన్లకు తగిన ఆదేశాలు ఇవ్వాలి.

## తగ్గుపర్తి గ్రామ సచివాలయంలో "ఆధార్ స్పెషల్ క్యాంప్"లను పరిశీలించిన ఎంపీడీవో



**బెలుగుప్ప, మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, మంగళవారం బెలుగుప్ప మండలం లోని తగ్గుపర్తి గ్రామ సచివాలయం నందు 'ఆధార్ స్పెషల్ క్యాంప్స్'లను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంను ఎంపీడీవో సుబ్బరాజు పరిశీలించి అనంతరం గ్రామ సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు చేసి అనంతరం ఎంపిడివో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం అనగా 23వ తేదీ నుండి 26వ తేదీ వరకు 'ఆధార్ స్పెషల్ క్యాంప్స్' షెడ్యుల్ ప్రకారం నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశంను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సుబ్బరాజు, ఈవో ఆర్డీ మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శంకర, డిజిటల్ అసిస్టెంట్ జగదీశ్వర్ నాయక్ మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### వాహన యజమానుల

## ఖాతాల్లో నగదు జమ

### జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ వీర్రాజు

**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో రెవిన్యూ, పోలీసు అధికారులకు ఎన్నికల విధుల నిమిత్తం ఏర్పాటు చేసిన వాహనాలకు సంబంధించిన అద్దె మొత్తాన్ని ఆయా వాహనాల యాజమానుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా ఉపరవాణా శాఖ కమిషనర్ వీర్రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవిన్యూ అధికారులకు ఎన్నికల తేదీ మే 13న వరకు ఏర్పాటు చేసిన వాహనాలకు రూ.2,08,000లు నగదును వాహన యాజమానుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఎన్నికల అనంతరము రెవిన్యూ,పోలీసులకు ఏర్పాటు చేసిన వాహనాలకు ఇంకా రూ.33 లక్షల రూపాయలు వాహన యాజమానుల బ్యాంకు ఖాతాలలో జమ చేయవల్సి ఉందన్నారు. ఎన్నికల తేదీ వరకు పోలీసులకు ఏర్పాటు చేసిన వాహనాలలో ,అనంతపురం హెడ్ క్వార్టర్స్ లో ఏర్పాటు చేసిన వాహనాలకు రూ. 36 లక్షలు వాహన యజమానుల ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలీసులకు ఏర్పాటు చేసిన వాహనాలకు ఇంకా రూ.28 లక్షల రూపాయలు జమ కావాల్సి ఉందన్నారు. వాహన యజమానులు రావాల్సిన మిగిలిన అద్దె నగదుపై ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా ఉపరవాణా కమిషనర్ వీర్రాజు తెలిపారు. వాహన యజమానులకు కావలసిన సమాచారం కోసం కార్యాలయ పనివేళలలో తనను నేరుగా సంప్రదించవచ్చునని ఉపరవాణా శాఖ కమిషనర్ తెలిపారు.

## మల్లినమడుగు గ్రామంలో బ్లీచింగ్



**రొళ్ల, మేజర్ న్యూస్ :** రొళ్ల మండల కేంద్రంలోని మల్లినమడుగు గ్రామంలో మంగళవారం బ్లీచింగ్ పౌడర్ చల్లించడం జరిగినది. గ్రామ పంచాయతీ కార్యదర్శి అహల్య ముందుండి బ్లీచింగ్ వేయించారు. ఈ సందర్భంగా అహల్య మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా ఉన్నందున పరిసరాల్లో నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతాయి, కావున ప్రజలు అప్రమత్తంగా ఉండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల న్నారు. తొట్టెల్లో నీరు నిల్వ ఉండకుండా, డ్రైనేజీల్లో చెత్తచెదారం వేయకుండా చూసుకోవాలన్నారు.

## ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్న బస్సులపై ఫిర్యాదులు ఇస్తే చర్యలు తీసుకుంటాం

### జిల్లా రవాణాశాఖాధికారి వీర్రాజు



అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ : జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల యాజ మన్యాలు, ప్రైవేట్ వాహనాల యాజమనులు ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతు న్నట్లు ఫిర్యాదులు ఇస్తే కచ్చితంగా తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణాశా ఖాధికారి వీర్రాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రవాణా శాఖ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రెగ్యులర్‌గా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నార న్నారు. స్కూల్ బస్సులు, ప్రైవేట్ బస్సులు, పెద్ద వాహనాలు, ఫోర్ వీలర్ల వాహనాల కండిషన్లను తనిఖీలు నిర్వహిస్తూ, వాటికి ఎఫ్‌సీ, లైసెన్సు, పర్మిట్లు, వాహన కాలుష్య అనుమతులను పరిశీలించి, సరైన రికార్డులు లేకున్నా, అధిక లోడుతో వెళ్లుతున్న వాహనాల పై కేసులు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. స్కూల్ బస్సులకు 60 ఏళ్లు నిండిన డ్రైవర్లను పెట్టుకోవద్దని యాజమాన్యాలకు అనేక మార్లు ఆదేశించామన్నారు. ఇటీవల నగర శివారులోని ఎస్ఆర్‌కె స్కూల్ బస్సును డ్రైవర్ మద్యం మత్తులో నడపటంతో ప్రమాదానికి గురికావడంతో విద్యార్థి సంఘాల నుంచి ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ ఘటనపై రాప్తాడు సీఐ త్వరలోనే రిపోర్టును తమకు అందచేయనున్నారని, ఆ రిపోర్టు ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## చంద్రబాబు కృషితో ఏపీకి మంచి రోజులు

### కేంద్ర బడ్జెట్ ఇందుకు సంకేతం

**ఏపీకి చాలా రోజుల తర్వాత బడ్జెట్ లో న్యాయం**

**అమరావతి, పోలవరం, వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వడంపై హర్షం**

**కేంద్ర బడ్జెట్‌పై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత స్పందన**



అనంతపురం, మేజర్ న్యూస్ : ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వలనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తున్నాయని.. ఇందుకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులే ఇందుకు నిదర్శనమని మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఏపీకి కేంద్రం ప్రత్యేక సాయం ప్రకటించడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని.. ఇప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక అమరావతి నిర్మాణానికి రూ. 15 వేల కోట్లు ఇస్తామని చెప్పడం హర్షించదగ్గ పరిణామం అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు 200 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో పూర్తి ఖర్చు కేంద్రం భరిస్తుందని చెప్పారని.. ఇది పూర్తైతే రాయలసీమకు కూడా నీటి కష్టాలు తీరే అవకాశం ఉందన్నారు. ఇండస్ట్రియల్ కారిడార్ ద్వారా వేల కోట్ల పెట్టుబడు లు, ఉపాధి అవకాశాలు పెరుగు తాయని.. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తాయన్నారు. విభజన చట్టంలో పొందుపర్చినట్లుగా వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పడం సంతోషం కల్గించింద న్నారు. రాయలసీమ, ప్రకాశం జిల్లా, ఉత్తరాంధ్రకు నిధులు కేటాయించడం వలన ఈ ప్రాంతాల్లో ఉన్న కష్టాలు కొంతైనా తీరుతాయ న్నారు. ప్రస్తుతం అనంతపురం జిల్లాకు ఈ నిధులు ఎంతో అవసరం అని ఆమె అభిప్రాయపడ్డారు. నీరు, విద్యుత్, రైల్వే, రోడ్ల ప్రాజెక్టులకు దశలవారీగా నిధులు కేటాయిస్తే.. ఇక రాష్ట్రం అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. కేంద్రం ఈ విధంగా సాయం ప్రకటించడం వెనుక చంద్రబాబు ప్రయత్నం ఉందని.. ఒక మంచి నాయకుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రానికి ఇలా మంచి జరుగుతుందని సునీత అన్నారు.



నూతన ఎమ్మెల్సీ గా ప్రమాణస్వీకారం చేసిన పి.హరిప్రసాద్‌ను జనసేన పార్టీ కార్యక్రమాల కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

• అనంతపురం విద్య, మేజర్ న్యూస్

## రాక్రీట్ సంస్థ అక్రమాలపై విచారణ జరిపించండి



▸▸ మొదటి పేజీ తరువాయి

సక్రమంగా చేయలేదన్నారు. అంతేకాకుండా ఇసుక, సిమెంట్, ఐరన్ పేరుతో పెద్ద ఎత్తున నిధుల దోపిడీ జరిగిందన్నారు. కొన్ని చోట్ల ఇళ్ల నిర్మించ కుండా బిల్లులు కాజేశారని.. అలాగే ఒకే పేరుతో పదుల సంఖ్యలు ఇళ్లు తీసుకున్నారన్నారు. అవినీతిపై ఫిర్యాదు చేయగా విచారణ జరిపిన తర్వాత నివేదికను తొక్కి పెట్టారాని వీటన్నింటిపై సమగ్ర విచారణ చేయించాలని వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కచ్చితంగా విచారణకు ఆదేశిస్తామన్నారు. అలాగే హౌసింగ్ శాఖ మంత్రి పార్థసారథి దీనిపై తీవ్రంగా స్పందించారు. అక్కడే సమావేశంలో ఉన్న హౌసింగ్ సెక్రటరీతో మాట్లాడి అన్ని వివరాలు సమగ్రంగా అందించాలని సూచించారు. దయచేసి వెంటనే ఈ పనులు తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. వీలైనంత త్వరగా పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు పేరూరు ప్రాజెక్టు నిర్వహణకు నిధులు కేటాయించాలని కూడా ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పేరూరులో ప్రాజెక్టు గత ఐదేళ్లలో నిర్వహణ సరిగా పూర్తిగా అధ్వాన్న స్థితికి చేరుకుందన్నారు. జలవనరుల శాఖ అధికారులు ప్రాజెక్టును పరిశీలించి.. మరమ్మతులకు కోటి 26లక్షలు అవుతుందని అంచానా వేశారన్నారు. ముఖ్యంగా 5, 8గేట్లు పూర్తిగా విరిగిపోయా యన్నారు. ఇలాంటి సమయంలో ప్రాజెక్టుకు నీరు వస్తే.. పూర్తిగా ఇబ్బంది అవుతుందన్నారు. అందుకే ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారు.

### పేరూరు ప్రాజెక్టుపై సీఎం, మంత్రికి విజ్ఞాపనలు



రామగిరి మండలంలోని అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్ (పేరూరు)కు నీరందించే పనులు మళ్లీ ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి పరిటాల సునీత వినతి పత్రం అందజేశా రు. 2018లో 804కోట్లతో పుట్టకనుమ, సోమర వాండ్లపల్లి ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు ప్రాజెక్టుకు 53కిలోమీటర్ల మేర కాలువ తవ్వి హంద్రీనీవా నుంచి నీరు అందించాలని ప్రతిపాదించామన్నారు. అప్పట్లో నిధులు కూడా కేటాయింపులు జరిగాయన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దీనిని పూర్తిగా గాలికొదిలేశారని.. ఒక్క అడుగు కూడా పని చేయలేదన్నారు. పైగా పుట్టకనుమ రిజర్వా యర్ ను రద్దు చేసి.. ముట్టాల, తోపుదుర్తి, దేవరకొండ రిజర్వాయర్లను తీసుకొచ్చారన్నారు. ఇప్పటికే వేలాది మంది రైతులు దీనిపై ఆశలు పెట్టుకున్నారు.. చాలా మంది రైతులు భూములు కూడా ఇచ్చారన్నారు. ఆ రైతులకు నేటి ధరల ప్రకారం పరిహారం మంజూరు చేయాలని కోరారు. ఎన్నికల హామీగా పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి రిజర్వాయర్లు నిర్మించి.. పేరూరుకు నీరందిస్తామని హామీ ఇచ్చినట్లు వివరించారు.

### రామగిరి గురుకుల పాఠశాలను ఇంటర్ వరకు అవకాశం కల్పించండి

రామగిరి మండలం నసనకోటలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఇంటర్మీడియట్ వరకు ఉన్నతీకరించాలని బీసీ సంక్షేమ మంత్రి సవిత, అలాగే సంబంధిత శాఖ సెక్రటరీకి వినతి పత్రం అందజేశారు. ఇక్కడ 5 నుంచి పదవ తరగతి వరకు ప్రస్తుతం పాఠశాల ఉందని.. ఇక్కడ 560మంది బాలికలు చదువుతున్నారని వివరించారు. వీరు పదవ తరగతి పూర్తి చేసుకున్న తర్వాత ఇంటర్మీడియట్ కు వేరే ప్రాంతాలకు వెళ్లలేక.. చదువు మానేస్తున్నారన్నారు. అందుకే ఇక్కడ పాఠశాలను ఇంటర్మీడియట్ వరకు పొడిగిస్తే.. వందలాది మందికి ఉపయోగపడుతుందన్నారు. అలాగే నైట్ వాచ్ మెన్ ను అదనంగా నియమించాలని కోరారు. దీనిపై మంత్రి సవితతో పాటు మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విభాగానికి సంబంధించిన సెక్రటరీ కూడా సానుకూలంగా స్పందించారు. దీనిపై అన్ని అంశాలు పరిశీలించి.. వచ్చే ఏడాది నుంచి ఇంటర్మీడియట్ కు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## కేంద్ర బడ్జెట్, టైటిలింగ్ యాక్ట్ రద్దు తీర్మానాలపై సంబరాలు

**అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన మేరకు పార్టీ కార్యాలయంలో సంబరాలు**

**మోదీ, చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం**

**చంద్రబాబు చొరవ వలనే ఏపీకి పెద్ద ఎత్తున నిధులు**

**ఏపీలో ఇక అభివృద్ధి పరుగులు పెడుతుందన్న నాయకులు**



అనంతపురం విద్య మేజర్ న్యూస్ : ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ వలనే కేంద్ర బడ్జెట్ లో ఏపీకి న్యాయం జరిగిందని టీడీపీ నాయకులు అన్నారు. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన మేరకు అర్బన్ పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. జై చంద్రబాబు, జై పవన్ కళ్యాణ్ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ రాష్ట్రాభివృద్ధి కోసం ఎంతో శ్రమిస్తున్నారని.. అలాగే కేంద్రం దృష్టికి ఇక్కడి సమస్యలను చాలా సార్లు తీసుకెళ్లారన్నారు. దాని ఫలితంగానే కేంద్ర బడ్జెట్ లో ఏపీకి 15వేల కోట్ల నిధులిచ్చారన్నారు. అలాగే రాష్ట్రానికి జీవనాడిలా ఉన్న పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇచ్చి.. నిర్ణీత గడువు లోగా పూర్తి చేస్తామని చెప్పార న్నారు. ఇక పరిశ్రమలకు రాయితీలు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇస్తామని చెప్పడం హర్షించదగ్గ పరిణామమన్నారు. మరోవైపు రాష్ట్రంలో ప్రజలకు శాపంగా ఉన్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవం తీర్మానం చేయడంపై కూడా వారు హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం ప్రజల భూములను కాజేయాలని చూస్తే.. దానిని మా ప్రభుత్వం అడ్డుకుందని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, టిడిపి పార్టీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహ్మద్, కురువ సంఘ యువజన విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి కాశీ విశ్వనాథ్, బీసీ సంఘం నాయకుడు జోగి రాజేంద్ర, తెలుగుదేశం పార్టీ నాయకులు నెట్టెం బాలకృష్ణ, గోళ్ళ సుధాకర్ నాయుడు, తమ్మినేని వేణు, రాయల్ కొండయ్య, వన్నూరప్ప, మాజీ కార్పొరేటర్ మల్లెల దుర్గేష్, సుంకన్న, కుళ్లాయప్ప, కుమార్, బాలకృష్ణ, చలం, టిఎన్ఎస్ఎఫ్ నాయకుడు అమర్, తెలుగు యువత నగర అధ్యక్షుడు బొమ్మినేని శివ, మహిళా నాయకురాలు నేహా ఆయేషా, గడిపూటి సురేష్ చౌదరి టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైసిపి..

**కేంద్ర బడ్జెట్ పై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పందన**

**అమరావతికి, పోలవరానికి నిధులు ప్రకటించడంపై హర్షం**

**ఏపీలో ఇక పారిశ్రామికాభివృద్ధి పరుగులు పెడుతుంది**



అనంతపురం విద్య, మేజర్ న్యూస్ : రాష్ట్ర విభజన తరువాత కేంద్ర బడ్జెట్ లో తొలిసారి ఏపీకి న్యాయం జరిగిందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కేంద్ర ఆర్థిక ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్ పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. గత దశాబ్దకాలంగా ఏపీ అడుగుతున్న వాటిని కేంద్ర బడ్జెట్ లో పొందుపరచడం సంతోషంగా ఉందన్నారు. అమరావతికి రూ. 15 వేల కోట్లు ఇవ్వడం వలన ఇక కలల రాజధాని నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతాయన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో కేంద్రం స్పష్టంగా హామీ ఇచ్చిందని.. వీలైనంత త్వరగా నిధులు కూడా కేటాయిస్తే ఏపీ ప్రజలు సంతోషిస్తారన్నారు. అలాగే అన్నిటికంటే ముఖ్యంగా రాయలసీమకు ఈసారి న్యాయం చేశారన్నారు. ఆగిపోయిన వెనుకబడిన ప్రాంతాలకు నిధులిస్తామని చెప్పడం ఆనందాన్నిచ్చిందన్నారు. రాయలసీమ, ప్రకాశం, కోస్తా ఆంధ్రలలో వెనుకబడిన జిల్లాలకు ఆర్థికసాయం చేస్తామని చెప్పడం వలన ఈప్రాంత ప్రజల్లో ఆశలు చిగురించాయన్నారు. ఏపీలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి కేంద్రం ప్రకటనలు ఆర్థికంగా తోడ్పాటునందిస్తాయన్నారు. అలాగే పారిశ్రామిక మౌళిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం ఇవ్వడం వల్ల పారిశ్రామికాభివృద్ధి పరుగులు పెట్టే అవకాశం ఉందన్నారు. కేంద్రం ఇంత సానుకూలంగా కేటాయింపులు ఇవ్వడం వెనుక చంద్రబాబు కృషి ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభిప్రాయ పడ్డారు.




## రైతులకు పంట పెట్టుబడి సహాయం రూ.20వేలు ఇంకెప్పుడు ఇస్తారు?

### – కూటమి ప్రభుత్వంపై వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఎన్వీ నారాయణ మండిపాటు

**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** అధికారంలోకి వస్తేనే రైతులకు ఏటా పంట పెట్టు బడి సాయం రూ.20వేలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఖరీఫ్ మొదలై నెలరోజులు గడస్తున్నా ఇంకెప్పుడు ఇస్తారని వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు ఎన్వీ నారాయణ మండిపడ్డారు. మంగళవారం ఆయన వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో 7 లక్షల ఎకరాల్లో 3.50 లక్షల ఎకరాల్లో వేరుశెనగ పంటను రైతులు సాగు చేస్తారన్నారు. కాని గత ఏడాది, ప్రస్తుత ఏడాది వర్షాలు సకాలంలో కురవక వేరుశెనగ సాగు గణనీయంగా తగ్గిపోయిందన్నారు. కరువుతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. 2023 ఇన్‌పుట్ సబ్సిడిని, ఇన్సూరెన్స్ సొమ్ము రైతుల ఖతాల్లో జమ చేసి ఉంటే కొంతైనా ఉపశమనం ఉండేదన్నారు. గతంలో చంద్రబాబు రుణమాఫి చేస్తానని హామీ ఇచ్చి విడతల వారిగా అరకొరగా రైతులకు అన్యాయం చేశారన్నారు. మరలా రైతులకు ఇచ్చిన హామీలను, సూపర్‌సిక్స్ హామీలను నిలబెట్టుకోవడంలో కాలయాపన చేస్తున్నారన్నారు.ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీల్లో అనంతపురము జిల్లాలో కరువు రైతులను ఆదుకునేందుకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నకేశవుల యాదవ్, చితంబర్ రెడ్డి,రవి నాయక్ ,వీరాంజనేయులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ప్రత్యేక హెూదా ప్రస్తావనే లేదు

### – సీపీఐ జిల్లా కార్యదర్శి సీ.జాఫర్



**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్:** కేంద్రఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేక హెూదా ప్రస్తావనే చేయకపోవడంతో రాష్ట్ర ప్రజలు నిరాశ చెందారని సీపీఐ జిల్లా కార్యదర్శి సీ.జాఫర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో టిడిపి,జనసేన,బీజపీ కూటమి తిరుగులేని మెజారిటితో అధికారంలోకి, కేంద్రంలో కూడా ఎన్డీఏ ప్రభుత్వ ఏర్పాటు లో చేరడంతో ఈసారి ఏపీకి ప్రత్యేక హెూదా వస్తుందని రాష్ట్ర ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చూశారన్నారు. కాని నిరాశే మిగిలిందన్నారు. ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి రూ. 15,000 కోట్ల రూపాయలు అప్పుగా కాకుండా నేరుగా గ్రాంట్ ప్రకటించాల్సిందన్నారు. అప్పుగా ఇవ్వడం వల్ల రాష్ట్ర ఆర్థిక సంక్షోభంలోకి వెళుతోందన్నారు. విభజన చట్టం ప్రకారం 2014 నుంచి వెనుకబడిన ప్రాంతాలకు రూ.2వేల కోట్లు విడుదల చేయాలన్నారు. రైల్వే జోన్, కడప ఉక్కు, విశాఖ స్టీల్ ప్లాంట్ కు రూ.4వేలు కోట్లు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. 970 కిలోమీటర్ల సముద్రతీరా ప్రాంతాన్ని టూరిజం డెవలప్మెంట్ గా చేయాలన్నారు. తిరుపతి అభివృద్ధి విషయాన్ని దాటివేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్యాయం జరిగిందన్నారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి పార్లమెంట్లో రాష్ట్ర ఎంపీలు బడ్జెట్ న్యాయం కొరకు గళం విప్పాలని కోరారు.

## దేవాలయాల్లో హుండీల లెక్కింపు..

మడకశిర , మేజర్ న్యూస్ : మండల పరిధిలోని ప్రసిద్ధి చెందిన శ్రీ జిల్లెడగుంట ఆంజనేయ స్వామి, భక్తర హల్లి లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవాలయాల హుండీలు, ఈ రోజు మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యం లో లెక్కించడం జరిగింది. శ్రీ జిల్లెడ గుంట ఆంజనేయ స్వామి దేవాలయం హుండీలో మొత్తం 2,30,740.00 రూపాయలు ఉండగా , భక్తర హల్లి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయము యొక్క హుండీలో మొత్తం 6,03,569.00 రూపాయలు ఉన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు,అర్చకులు పాల్గొన్నారు.



## స్టాక్ యార్డ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు..

### – జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్



పుట్టపర్తి మేజర్ న్యూస్: జిల్లాలోని ఇసుక స్టాక్ యార్డుల నందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ మైనింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఉచిత ఇసుక విధానం ద్వారా డిఎల్ఎస్సి సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, సేబ్ అధికారి విష్ణు, జిల్లా మైన్స్, జియాలజీ అధికారి రామ్మోహన్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వినియోగదారులకు జూలై 8వ తేది నుంచి ఉచితంగా ఇసుక సరఫరా చేయడం జరుగుతూ ఉందని తెలిపారు.ఇసుక పూడికతీత కార్యక్రమాలు త్వరితగతన చేపట్టాలని అందుకు జల వనరుల, మైనింగ్, రెవిన్యూ, కాలుష్యం నియంత్ర మండల శాఖ ఆధ్వర్యంలో జూలై 30 తేదీ లోపల కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఇసుక నిల్వచేసిన డంపింగ్ యార్డ్ నందు సీసీ కెమెరాలు, అవసరమైన సిబ్బంది ఏర్పాటు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత ఎమ్మార్వోలు, మైనింగ్ అధికారులు కొత్తగా ఇసుక రీచ్ లు గుర్తించాలని తెలిపారు. వారంలో మూడుసార్లు మైనింగ్ అధికారులు డంపింగ్ యార్డ్ నందు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. సంబంధిత ఆర్డీవోలతో, పంచాయతీ అధికారులతో మైనింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షణ కలిగి ఉండాలని తెలిపారు. గతంలో మహిళ సంఘాలకు ఇసుక రీచ్ లు అప్పజెప్పడం జరిగిందని దానికి సంబంధించిన జీవోలు, అటువంటి నివేదికలు త్వరితగతిన నాకు అందజేయాలని డిఆర్డిఎ పిడి ని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఇసుక యార్డులకు ఇతర ప్రాంతాల నుంచి ఇసుక తరలించి, తీసుకువచ్చేందుకు అయ్యే నిర్వాహణ వ్యయాన్ని మాత్రమే వసూలు చేస్తూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఇసుక సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు.

ఇసుక సరఫరాపై ఫిర్యాదులు. సలహాల కోసం ఒక కంట్రోల్ రూమును ఏర్పాటు చేస్తున్నామని, టోల్ ఫ్రీ నెంబరు 1800-425-6041 ను ఏర్పాటు చేశామని ఎవ్వరైనా ఈ నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అన్నారు.అక్రమ, అనధికారిక త్రవ్వకాలపై ఉక్కుపాదం మోపుతూ అటువంటి వాటిని నిరోధించేందుకు నిర్ధేశించిని జరిమానాలకు సంబంధించి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. సంబంధిత ఆర్డిఓలు, పోలీస్, సెబ్, మైనింగ్ డిపార్ట్ మెంట్, జిల్లా పంచాయితీ అధికారులు ఈ విషయంలో సమన్వయంతో పనిచేసి గట్టి నిఘా ఉంచాలన్నారు. చట్ట విరుద్ధమైన మైనింగ్, స్టాకింగ్, హెూర్డింగ్, అమ్మకం, బ్లాక్ మార్కెట్ కు పాల్పడే వ్యక్తులపై ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఈ కార్యక్రమాలకు వినియోగంచే వాహనాలను సీజ్ చేయడంతోపాటు జరిమానాలను విధించాలన్నారు. మైన్స్ విభాగానికి ఇసుక సమస్యలపై, ఫిర్యాదులపై అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు కదిరి వంశీకృష్ణ, డిపిఓ విజయ్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ఎస్ ఎస్సీ మల్లికార్జున అధికారులు ప్రతాప్, కృష్ణారెడ్డి, క్రాంతి శేఖర్ రెడ్డి లు పాల్గొన్నారు.

## గ్యాస్‌ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



పుట్టపర్తి రూరల్ మేజర్ న్యూస్ : సత్య సాయి జిల్లా బుక్కపట్నం మండల కేంద్రంలో ఉన్న సాయి చంద్ర గ్యాస్ ఏజెన్సీ వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని, జిల్లా అధికారులను మంగళవారం సిపిఎం నాయకులు కోరారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్, శాఖా కార్యదర్శి బ్యాల్ల అంజి, జిల్లా కార్యాలయంలో డిఆర్ఓ కొండయ్యకు వినతిపత్రం అందజేసి అనంతరం వారు మాట్లాడుత బుక్కపట్నం లో ఉన్న గ్యాస్ ఏజెన్సీ యాజమాను వ్యక్తిగత గొడవలతో ప్రజలకు ఇబ్బంది కలిగించడం సరైనది కాదని,గ్యాస్ ఏజెన్సీ కి సంబంధించిన అధికారులు వెంటనే స్పందించి ప్రజలకు గ్యాస్ సరఫరా చేసే విధంగా ఏజెన్సీ వారి పై ఆ శాఖ స్థాయి అధికారులు తగ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గత నాలుగు వారాలుగా ప్రజలకు అందుబాటులో లేకుండా ఉండడంతో బుక్కపట్నం మండల ప్రజానీకం ఆందోళనకు గురవుతున్నారన్నారనీ. ఏజెన్సీ వారికి ఉన్న అంతర్గత ఘర్షణలవల్ల ప్రజలకు నిత్యవసర వస్తువులలో ఒకటైన గ్యాస్ ప్రజలకు అవసరమైనప్పుడు సరఫరా చేయక ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదన్నారు. కాబట్టి ఏజెన్సీ వారిపై విచారణ చేపట్టి ప్రజలకు సకాలంలో గ్యాస్ సరఫరా చేసే విధంగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం పెద్దన్న, జిల్లా నాయకులు ఎం గంగాధర్, చంద్ర, సిఐటియు నాయకులు వెంకటేష్ ,శీనవాసులు, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

### – నాల్గవ రోజు సందర్శనలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుళ్లాయిస్వామి



**అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ ,ఎస్టీ ,మైనారిటీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి రాష్ట్ర సమితి సభ్యురాలు సాయి స్వరూప డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు వసతి గృహాల సందర్శన కార్యక్రమంలో మంగళవారం నగరంలో నాలుగవ రోజు గిల్డప్ సర్వీస్ స్కూల్లో బీసీ, ఎస్సీ వసతి గృహాలను సందర్శించారు. ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి,రాష్ట్ర సమితి సభ్యురాలు సాయి స్వరూప మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు పెండింగ్లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.వసతి గృహాల్లో పాతబడిన బాంగ్లాలో నిర్వహిస్తున్నారని,వాటికి నూతన భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.గత రాష్ట్ర ప్రభుత్వం నుంచి మెనూ ఏమో విపరీతంగా పెంచారు కానీ పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచలేదని తక్షణమే మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కనీసం లైట్లు పోయిన ఫ్యాన్లు లేకపోయినా బాత్రూంలో టాయిలెట్స్ క్లీన్ చేయడానికైనా వార్డెన్లు తమ సొంత డబ్బులతో ఖర్చు చేస్తున్నారన్నారు. వసతి గృహాల సమస్యలపై జిల్లావ్యాప్తంగా ప్రతిరోజు ప్రతి నియోజకవర్గంలో హాస్టల్ విద్యార్థుల సమస్యలు తెలుసుకొని ఆగస్టు 6వ తేదీన కలెక్టరేట్ కార్యాలయం వద్ద విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని శాంతి యుతంగా మహా ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్, నాయకులు రాధా ,జ్యోతి ,పవన్ ,తారక్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు కృషి వల్ల రాష్టానికి నిధుల వరద

**-రాయలసీమలో వ్యవసాయం, పారిశ్రామి కంగా అభివృద్ధి చూస్తారు**
**-ధర్మవరం ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ స్పందన**



**ధర్మవరం మేజర్ న్యూస్:** మేము అది కారంలోకి రాగానే.. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తీసుకొచ్చి.. అభివృద్ధి చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు అన్నారని.. ఇప్పుడు తొలి బడ్జెట్ లోనే ఏపీకి నిధులు కేటాయించారని ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే సాధ్యమైందని అభిప్రాయపడ్డారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రకటించిన బడ్జెట్ పై శ్రీరామ్ స్పందిస్తూ... అమరావతిని నాశనం చేయాలని గత వైకాపా పాలకులు చూశారని.. కానీ ఇప్పుడు స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రే అమరావతి గురించి ప్రస్తావిస్తూ 15వేల కోట్లు నిధులు కేటాయించారన్నారు. ఇక ఏపీకి జీవనాడి అయిన పోలవరంను పూర్తి చేస్తామని.. ఇందుకు అవసరమైన నిధులు కేటాయిస్తామని చెప్పడం కూడా మనకు శుభవార్త లాంటిదన్నారు. కచ్చితంగా ఇక పోలవరం, రాజధాని నిర్మాణ పనులు పరుగులు పెడుతాయన్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రత్యేక రాయితీలు ఇస్తామని చెప్పడం వలన రాష్ట్రంలో ఇక పరిశ్రామికాభివృద్ధి వేగంగా ఉంటుందన్నారు. ఏపీలో నీరు, విద్యుత్, రైల్వే, రోడ్లు ప్రాజెక్టులకు దశలవారీగా నిధులు కేటాయించ వలన ఇన్ని రోజులు జరిగిన నష్టాన్ని పూడ్చుడంతో పాటు సరికొత్త ఆంధ్రప్రదేశ్ ను చూస్తారన్నారు. అన్నిటికంటే ముఖ్యంగా రాయలసీమ, ప్రకాశం, కోస్తా ఆంధ్రలలో వెనుకబడిన జిల్లాలకు ఆర్థికసాయం ప్రకటించడంపై శ్రీరామ్ హర్షం వ్యక్తం చేశారు. రాయలసీమకు ప్రతిసారి అన్యాయం జరుగుతుండేదని.. ఇన్ని రోజులకు మంచి శుభవార్త చెప్పినట్టైం దన్నారు. మరీ ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఈ బడ్జెట్ ఎంతో అవసరం అన్నారు.

# ఆధునిక విద్యా వ్యవస్థను సరళీకృతం చేయండి

**- బుక్కపట్నం డైట్ ప్రిన్సిపాల్ రవి సాగర్**



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** ఆధునిక విద్యా వ్యవస్థను సరళీకృతం చేయాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వము ఉపాధ్యాయులకు తగిన రీతిలో శిక్షణ ఇస్తున్నట్లు బుక్కపట్నం డైట్ ప్రిన్సిపల్ రవి సాగర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీచ్ టూల్ అబ్జర్వేషన్ ట్రైనింగ్ లో భాగంగా ఆయన తనిఖీ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ధర్మవరం భవనంలో జరుగుతున్న 9రోజుల శిక్షణ తరగతులను ఆయన తనిఖీ చేశారు. ధర్మవరం డివిజన్ కు సంబంధించిన హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు ఈ ట్రైనింగ్‌కు హాజరయ్యారు. దాదాపు 110 మంది టీచ్ టూల్ అబ్జర్వర్లుగా ఈ ట్రైనింగ్‌లో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ టీచ్ టూల్ ట్రైనింగ్ ప్రపంచంలో 38 దేశాల్లో అమల్లో ఉందని ఈ విధానం పట్ల ఇప్పటివరకు 6మిలియన్ల బడి పిల్లలు లబ్ధి పొందారని, అందులో భాగంగా వరల్డ్ బ్యాంక్ నిర్వహించబోతున్న సాల్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఎస్సీఈఆర్టీ, సమగ్ర శిక్ష వారి ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ అబ్జర్వర్ ట్రైనింగ్‌లో లబ్ధి పొందిన అబ్జర్వర్తో క్లాస్ రూమ్ అబ్జర్వేషన్ చేయడం జరుగుతుందని, తద్వారా ఆధునిక విద్యా విధానంలో తరగతి గదిలో అబ్జర్వర్లు అందరి క్లాస్ రూమ్ అబ్జర్వేషన్ జరిపి, ఆన్లైన్లో నమోదు చేయుటకు పూర్తిస్థాయి యాక్షన్ ప్లాన్ పరిశీలన షెడ్యూల్ అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ మాలిక్- సిఎంఓ, రాజేశ్వరి దేవి- ఎంఈఓ, డిస్టిక్ ఇంచార్జ్ , టీచ్ టూల్ అబ్జర్వర్లు, ప్రధాన ఉపాధ్యాయులు అస్లం భాష పాల్గొన్నారు.

## ఎన్డీఏ ప్రభుత్వానికి ధన్యవాదాలు

**-గోనుగుంట్ల భూషణ్ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు**



బత్తలపల్లి మేజర్ న్యూస్: కేంద్ర బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కి ప్రత్యేక కేటాయింపుల పై నిడిగల్లు సర్పంచ్ భూషణ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి రూ.15000 కోట్లు, ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్ట్ కి అధిక నిధుల కేటాయింపు, వైజాగ్ – చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కు బెంగళూరు హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్ అంతేకాక ఈ ఏడాది నిధులు కేటాయింపు వెనుకబడి పోయిన ఉత్తరాంధ్ర మూడు జిల్లాలు రాయలసీమ నాలుగు జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రత్యేక నిధులు ఇవ్వడం పట్ల ఉమ్మడి అనంతపురం జిల్లా సర్పంచ్ల సంఘం అధ్యక్షులు గోనుగుంట్ల భూషణ్ హర్షం వ్యక్తం చేశారు. సమస్తవంతమైన పరిపాలన చేయాలంటే అది ఒక్క చంద్రబాబుకే సాధ్యమని ఆయన వల్లే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని అన్నారు.

## జిల్లాను అభివృద్ధి పథంలో కొనసాగించండి

**- ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ విన్నపం**





**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** సత్యసాయి జిల్లాను శ్రీ సత్య సాయి జిల్లాలో అభివృద్ధి పథంలో కొనసాగించేందుకు అధికారుల కృషి ఎంతో అవసరమని ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ జిల్లా కలెక్టర్ చేతన్ ను,ఎస్పీ రత్న ను కోరారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ పాటు, ఎస్పీ రత్న వారి, వారి కార్యాలయాల్లో పరిటాల శ్రీరామ్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇరువురికి తాను హృదయపూర్వక శుభాకాంక్షలు తెలపడం జరిగిందని తెలిపారు. పుట్టపర్తి జిల్లాను అభివృద్ధి బాటలో నడిపేందుకు తమ వంతు సహాయ సహకారాలు కూడా అందిస్తామని వారు తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో దుర్గమ్మకు బోనాలు



**ధర్మవరం మేజర్ న్యూస్:** పట్టణంలో పలు ప్రాంతాలకు చెందిన మహిళలు ఆషాడమాసం మంగళవారం దుర్గమ్మకు సమర్పించారు. ప్రదానంగా ప్రియాం కనగర్, సిద్దయ్యగుట్ట, దుర్గానగర్, యాదవవీధి, లోనికోట ప్రాంతాలకు చెందిన మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా దుర్గమ్మ ఆలయానికి చేరుకుని అక్కడ అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయం ఎదుట నిమ్మకాయలతో దీపాలు వెలిగించి అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు.అనంతరం దుర్గమ్మకు మహిళలు ప్రత్యేక పూజలు చేయించారు.ప్రధానంగా ప్రియాంక నగర్లో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి పీఠం ఎక్కితే దుర్గమ్మకు బోనాలు సమర్పిస్తామని మొక్కుకున్న ప్రియాంకనగర్ కాలనీ వాసులు ఆ మొక్కుబడి మేరకు మంగళవారం అమ్మవారికి బోనాలు సమర్పించామని ఆ కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ బోనాలోత్సవాలలో టిడిపి నాయకులు భీమినేని ప్రసాద్ నాయుడు, చీమల రామాంజి తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్



**ధర్మవరం మేజర్ న్యూస్:** ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు తనిఖీల్లో భాగంగా మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ధర్మవరం మార్కెట్యార్డ్లో.. గోదాముల్లో భద్రపరచిన ఈవీఎంలను జిల్లా కలెక్టర్ టీఎస్.చేతన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎం యంత్రాలు, భద్రతా చర్యలను కలెక్టర్ క్షున్నంగా పరిశీలనచేశారు.ఆనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..సార్వత్రిక ఎన్నికల సమయంలో ఉపయోగించుటకు వీలు కానీ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను మొత్తం 243,42 బ్యాలెట్ యూనిటీ, 53 కంట్రోల్ యూనిట్లు, 143 వివి ప్యాట్ నెంబర్లను ఈఎంఎస్ సాఫ్ట్వేర్ పద్ధతి ద్వారా స్కాన్ చేసి ఈవీఎం ప్రోటోకాల్ పాటిస్తూ ప్రత్యేక పోలీసుబందోబస్తుతో ఎన్నికల నిబంధనల మేరకు వాటిని బెంగుళూర్ లోని బెల్ కంపెనీకి మరమత్తుల నిమిత్తం పంపడం జరుగుతుందన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, కలెక్టర్ ఎన్నికల డిటీ మైనావుద్దీన్, తహసీల్దార్ రమేశ్ పాల్గొన్నారు.

## ఉచిత న్యాయ సదస్సు



**రామగిరి మేజర్ న్యూస్** కనగానపల్లి మండలం నెమలి వరం గ్రామంలో మహిళా శక్తి సొసైటీ అధ్యక్షురాలు సుబ్బమ్మ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా సొసైటీ పాలకవర్గం సిబ్బంది సమాజంలో బాల్యవివాహాల పాత్ర గురించి మద్యపానం వల్ల కుటుంబంలో ఎటువంటి సమస్యలు వస్తాయనే విషయంపై నాటిక రూపంలో ప్రదర్శించడం జరిగింది. అలాగే సొసైటీ కార్యనిర్వహణాధికారి అయినా బి. కాంచన సమాజంలో మహిళల యొక్క పాత్ర గురించి క్లుప్తంగా వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో మహాశక్తి సీఈవోరమీజా టింబక్టు కలెక్టివ్ నుండి గౌరీ ముఖ్యఅతిథిగా హాజరు కావడం జరిగింది

## క్రీడాకారులకు స్పెయిన్ బృందం చేయూత



**ధర్మవర మేజర్ న్యూస్:** పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానం లో మంగళవారం బాస్కెట్బాల్ క్రీడాకారులకు స్పెయిన్ బృందం క్రీడాదుస్తులను అందజేసింది. స్పెయిన్ దేశానికిచెందిన అంతర్జాతీయబాస్కెట్బాల్ కోచ్లు మౌర్, ఒరియల్,నటాలియా, పోల్లు బాస్కెట్బాల్ క్రీడాకారులకు ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్ తోపాటు షూస్, బాల్లను ఏర్పాటుచేయగావాటిని ధర్మాంబ బాస్కెట్బాల్ అసోషియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ... పట్టణంలోని క్రీడాకారులకు అంతర్జాతీయ కోచ్లతో ఉచితంగా ఉదయం,సాయంత్రం స్పెయిన్ దేశానికి చెందిన కోచ్లతో శిక్షణ ఇవ్వడం హర్షనీయమన్నారు.క్రీడాకారులు ఉచిత కోచింగ్ను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదగాలన్నారు. ఈ కార్యక్రమం లో కోచ్ సంజయ్, ఆత్మీయట్రస్టు సభ్యులు జస్వంత్, హరిజిశ్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ మొక్కల పెంపకం కేంద్రం పరిశీలన



**ధర్మవరం మేజర్ న్యూస్:** ధర్మవరం ఎల్ కె సి పురం లోని కేంద్రీయ మొక్కల పెంపక కేంద్రాన్ని మంగళవారం మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో ఏ ఏ రకాల మొక్కలు ఉన్నాయో అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు . నర్సరీలోని మొక్కలన్నిటికీ పురుగు పడటంతో మందు కొట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న వారు కేంద్రీయ నర్సరీలో ఉన్న సమస్యలను మంత్రి ప్రతినిధులకు సిబ్బంది వివరించారు. నర్సరీ చుట్టూ కాంపౌండ్ లేకపోవడంతో ప్రతిరోజు మద్యం సేవించేవారు వచ్చి నర్సరీను పాడు చేస్తున్నారని, కావున దీని చుట్టూ ఒక పెద్ద కాంపౌండ్ వాల్ నిర్మించాలని కోరారు. మంత్రి ప్రతినిధులు హరీష్, మల్లికార్జునలు మాట్లాడుతూ నర్సరీలో నెలకొన్న సమస్యలను మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## అంగన్వాడి సెంటర్ తనిఖీ



ఓబులదేవరచెరువు, మేజర్ న్యూస్: జిల్లా కలెక్టర్ టి.ఎన్. చేతన్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని కొండకమర్ల పంచాయతీ వీరప్ప గారి పల్లి గ్రామానికి చెందిన మినీ అంగన్వాడి కేంద్రాన్ని మంగళవారం ఐసిడిఎస్ పిడి నాగమల్లేశ్వరీ తనిఖీ నిర్వహించారు. అంగన్వాడి కార్యకర్తపై గ్రామస్తులు గ్రీవెన్స్ లో భాగంగా, తమ గ్రామం లో మినీ అంగన్వాడి కేంద్రం, కార్యకర్త సరిగా విధులు నిర్వహించ దని, ప్రభుత్వం అందిం చే పౌష్టికాహారం అంద జేయదని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ పిడికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగా అంగన్వాడి సెంటర్ నిర్వహణ, రికార్డులు, పరిశీలిం చారు. అయితే ఇందు లో కొన్ని లోపాలను గుర్తించామని వాటిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఐసిడిఎస్ పిడి తెలిపారు. ఈ కార్య క్రమంలో సిడిపిఓ వరలక్ష్మి, గ్రామస్తులు ఉన్నారు.

## ప్రతి గ్రామంలో జెండా ఎగిరేలా చూడాలి



కదిరి టౌన్, మేజర్ న్యూస్ : పట్టణంలోని ఇంటర్ డిగ్రీ విద్యార్థుల వసతి గృహం నందు మంగళవారం విద్యార్థులను జాతికి జాగ్రత్తలు చేసే కార్యక్రమాన్ని ఎం ఈ ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగేంద్రనాథ్ అవగాహన కల్పించారు. మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు కోసం జాతి ఆ వత్తు ఎదురుచూస్తున్న విషయాన్ని వివరించారు. ఎస్సీ వర్గీకరణ పై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందడుగు వేయాలంటే సుప్రీంకోర్టు తీర్పు వెలువడాల్సి ఉందని తెలిపారు. ఈనెల చివరి వారంలో లేదా ఆగస్టు నెలలో తీర్పు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆలోపు జెండా ఆవిష్కరణలు ప్రతి గ్రామంలో జరిగేలా చూడాలన్నారు. మనం మన ఆత్మ గౌరవానికి అలాగే మన అస్తిత్వానికి ప్రత్యేకగా దండోరా జండాలను చూస్తున్నామని, ప్రతి గ్రామంలోనూ జెండా ఉండడం, మన నిర్మాణ శక్తి ,మన సంకల్ప శక్తికి నిదర్శనమని కొని యాడారు. ఈ కార్యక్రమంలో అజయ్, శ్రీనివాస్, రాహుల్, మనోజ్, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు చిరుధాన్యాల పంటలను పండించాలి



కదిరి, మేజర్ న్యూస్: చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల ప్రజలు వ్యాధి నిరోధక శక్తి, ఎముకల దృఢత్వం, ఆరోగ్యం సంపాదించు కోవచ్చు అని , తక్కువ ఖర్చు తక్కువ నీటితో తక్కువ వ్యవ ధిలో చిరుధాన్యాల పంటలు రైతుల చేతికి వస్తాయని అధిక దిగుబ డులు సాధించవచ్చు అని జిల్లా వనరుల కేంద్రం ఏ డి ఏ సనావుల తెలిపారు. మంగళ వారం కదిరి రూరల్ మండలంలోని కదిరి బత్తలపల్లి చెన్నయ్య గారి పల్లి గ్రామాలకు చెందిన రైతులు రఘునాథరెడ్డి శాంతమ్మ సాగుచేసిన కొర్ర, సజ్జ పంటలను కదిరి ఏ డి ఏ సత్య నారాయణతో కలిసి పరిశీలించారు. పంటలు బాగున్నాయని రైతులందరూ చిరు ధాన్యాల పంటలు సాగు చేయాలని వారు సూచించారు. చిరుధాన్యాలు కుర్ర సజ్జ రాయి జొన్న సామలు అంటూ కొర్రలు పండించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శ్రీనివాస్ రెడ్డి ,శశిధర్ రెడ్డి ,ఆత్మ సిబ్బంది ,ఎంపీఈఓ సుమియా, విహెచ్ఏ ప్రసాద్ రెడ్డి రైతుల పాల్గొన్నారు.

## కొనసాగిన న్యాయవాదుల రిలే దీక్షలు

కదిరిటౌన్, మేజర్ న్యూస్: కదిరి పట్టణానికి చెందిన న్యాయవాది రామస్వామి నాయుడు పై దాడి చేసిన వారిని పోలీసులు అరెస్టు చేయాలని పట్టణంలోని కోర్టు వద్ద న్యాయవాదులు దీక్షలు చేపట్టిగా, మంగళవారానికి ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. సంఘటన జరిగి 26 రోజులు అవుతున్న పోలీసులు నమ్మక నీలెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఇది ప్రజాస్వామ్యానికి మచ్చ అని పోలీస్ వ్యవస్థ పై ప్రజల్లో నమ్మకం పోయే పరిస్థితి నెలకొంటుం దని పలువురు న్యా యవాదులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదులు చేపట్టిన దీక్షలకు జిల్లాలోని పలువురు న్యాయవాదులు ప్రజాసంఘాల నాయకులు సైతం మద్దతు ప్రకటించారు. రిలే దీక్షలకు మందు తెలిపిన వారిలో న్యాయవాదులు లింగాల లోకేశ్వర్ రెడ్డి, 5 జిల్లా సురేంద్ర చౌదరి, రవీంద్రబాబు, వెంకటరామిరెడ్డి, ఇతర న్యాయవాదులు ఉన్నారు.



## రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర సాయంపై బిజెపి శ్రేణుల హర్షం



**ముదిగుబ్బ, మేజర్ న్యూస్ :** ఆంధ్రుల చిరకాల వాంఛలైన పోలవరం, అమరావతి నిర్మాణా లకు, వెనకబడ్డ జిల్లాల అభివృద్ధి, ప్రత్యేక కారిడార్లు ఏర్పాటుకు కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున అనుమ తులు, నిధులు మంజూరు చేయడం, కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను చాటుతోందని బిజెపి రాష్ట్ర అగ్రికల్చర్ రీసెర్చ్ కో కన్వీనర్ సోమల ప్రకాష్, ముదిగుబ్బ ఎంపీపీ ఆది నారాయణ యాదవ్ లు హర్షం వ్యక్తం చేశారు. మంగళ వారం పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్లో రాష్ట్ర ప్రజల ఆశయ సాధనకు, రాష్ట్ర సమగ్ర అభి వృద్ధికి భూతం ఇచ్చే లా నిధులు కేటాయిం చడం అభినందనీ యమన్నారు, రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధి, రాష్ట్రాన్ని అన్నపూర్ణలా తీర్చిదిద్దే పోలవరం నిర్మాణానికి విభజన హామీల మేరకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ భవిష్యత్తులో మరిన్ని నిధులు అందిస్తామని ప్రకటించడం జరిగిం దన్నారు. గత పాలకుల విధానాల కారణంగా తన ఉనికి ప్రమాదంలో పడ్డ ప్రతిష్టాత్మక నూతన రాజధాని అమరావతి నిర్మాణానికి సుముకు త వ్యక్తం చేయడం, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి కోసం రూపొందించిన విశాఖపట్నం చెన్నై కారిడార్, హైదరాబాద్ బెంగళూరు పారిశ్రామిక కారిడా ర్లకు, వెనకబడ్డ జిల్లాల సమగ్ర అభివృద్ధికి, ఆంధ్రుల హక్కు అయినా విశాఖ ఉక్కు కర్మాగా రానికి చేయూతనందిం చడానికి కేంద్ర ప్రభుత్వం సమ్మతించడం, భవి ష్యత్తులో రాష్ట్రంలోని వ్యవసాయ పారిశ్రామి క రంగాల అభివృద్ధి తోపాటు వెనకబడ్డ ప్రాంతాల అభివృద్ధి పురోగతి సాధిస్తుందని తద్వారా రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి, నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగాలు లభిస్తా యన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డబల్ ఇంజన్ విధానంలో కృషి చేస్తున్నాయి అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ కు సోమల ప్రకాష్ నాయుడు, ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ లు ధన్యవాదాలు తెలిపారు.

## దేశాభివృద్ధికి రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర బడ్జెట్ తోడ్పాటు

### – బిజెపి పట్టణ అధ్యక్షులు నగేష్ బాబు



హిందూపురం మేజర్ న్యూస్:– రాజ్యసభ లో మంగళవారం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఆంధ్రప్రదేశ్ కు ఎన్ డి ఏ ప్రభుత్వం హితోదికంగా సహాయ సహకారాలు అందించనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ వెల్లడించారని భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు కరణం నాగేష్ బాబు తెలిపారు. అన్ని ప్రాంతాల, అన్ని రంగాల అభివృద్ధికి, కేంద్రం నుంచి భారీగా నిధులు రాబట్టిన కూటమి ప్రభుత్వం.తరచూ చంద్రబాబు ఢిల్లీ పర్యటనలు చేసి రాష్ట్రాభివృద్ధి కి కృషి చేస్తున్నారని తెలిపారు.కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి లభించిన హామీలు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం రాష్ట్ర జీవనాడి పోలవరం పూర్తికి అధిక నిధులు రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ పారిశ్రామికాభివృద్ధికి హైదరాబాద్–బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి,విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్లోని నోడ్లకు ప్రత్యేక సాయం, కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాల అభివృద్ధి , హైదరాబాద్–బెంగళూరు కారిడార్లో ఓర్వకల్లుకు నిధులు, నీరు, విద్యుత్, రైల్వే, రోడ్లు ప్రాజెక్టులకు ప్రత్యేక నిధులు, విభజన చట్టంలో ఉన్న హామీల అమ లు, పూర్వోదయ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ కి ప్రత్యేక ప్రాజెక్ట్ అమ లుకు కేంద్రప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుంద న్నారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్రకు ప్రత్యేక నిధులు, మహిళల ఆస్తుల రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీ తగ్గింపు, ముద్ర లోన్ పరిమితి 20 లక్షల పెంపు, పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక సహకారం, నీళ్లు నిధులు, రహదారుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం 11.11 లక్షల కోటి ఇండ్లకు సోలార్ ప్యానల్ ద్వారా ఉచిత విద్యుత్, గ్రామీణ అభివృద్ధికి 2.66 లక్షలు కేటాయించారన్నారు.బంగారం, వెండి ధరలు, సెల్ఫోన్ల పై15 శాతం, కస్టమ్ డ్యూటీ తగ్గింపు, లెదర్ ఉత్పత్తుల పై పన్ను శాతం తగ్గింపు, క్యాన్సర్ మందులపై జీఎస్టీ తొలగింపు, ఎక్స్రే మెషీన్లపై జీఎస్టీ తగ్గింపు,25 రకాల కీలక ఖనిజాలపై కస్టమ్ డ్యూటీ తగ్గింపు, సోలార్ ఉత్పత్తులపై కస్టమ్ డ్యూటీ తగ్గింపు వల్ల మధ్య తరగతి సామాన్య ప్రజలకు ఉరట లభిస్తుందన్నారు.

## సకల జనులకు ఆమోదయోగ్యంగా కేంద్ర బడ్జెట్



హిందూపురం మేజర్ న్యూస్:– కేంద్ర ఆర్థిక శాఖా మాత్యులు నిర్మలా సీతారామన్ మంగళవారం నాడు ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో అన్ని వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేశారని బిజెపి రాష్ట్ర నాయకులు తిరుపతి జిల్లా ఇంచార్జి పి.డి.పార్థసారథి పేర్కొన్నారు.ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ ప్రధానంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజధాని నిర్మాణంకై 15 వేల కోట్లు నిధుల మంజూరు ,ఆంధ్రలో పెట్టుబడులు పెట్టె వారికే పారిశ్రామిక రాయితీలు, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు మంజూరు చేయడంతో పాటు రైల్వే లైన్ల నిర్మాణంకు ప్రత్యేక శ్రద్ధ వహించారని తెలిపారు. అలాగే రాబోవు రెండు సంవత్సరాలు కోటి మంది రైతులు ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించేలా 1.52 లక్షల కోట్ల కేటాయింపు కాని ముద్ర రుణాల పరిమితి 10 లక్షల నుండి 20 లక్షల వరకు పెంచడం, ప్రాణధార మందులపై కస్టమ్ డ్యూటీ తగ్గించడం, పెరిగిన ఆన్లైన్ వస్తువినియోగం దృష్టిలో ఉంచుకొని వాటిపై టాక్స్ తగ్గించడం, ఆహ్వానించదగిన పరిణామమని ప్రతియేటా భారతదేశంలో ఉన్నత విద్య చదివేవారికి 10 లక్షల రూపాయలవరకు విద్యారుణం అవకాశం కల్పించడం, స్టార్టప్ కంపెనీలపై టాక్స్ రద్దు మొదలైనవి విద్యార్థి, యువతకు ఉపకరిస్తాయని తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఈ బడ్జెట్ అన్ని వర్గాల ,అన్ని తరగతులవారికి ఉపయోగకరమైనదని కొనియాడుతూ ప్రధాని మోదీ కి ఆర్థిక మంత్రివర్యులకు ధన్యవాదములు తెలియచేసారు.

## ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోండి

### – డిప్యూటీ డీఏంఎచ్ ఓ నాగేంద్ర నాయక్

నల్లచెరువు, మేజర్ న్యూస్ : సీజనల్ వ్యాధుల అవగాహన కార్యక్ర మంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ నాగేంద్ర నాయక్ వ్యక్తి గత శుభ్రత పాటిస్తూ, ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటిస్తూ ఉండాలని డిప్యూటీ డి ఎం హెచ్ ఓ నాగేంద్ర నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాజమో ల్లపల్లి తండాలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. డిప్యూటీ డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహ రించాలని, పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకుంటూ వ్యక్తిగత శు భ్రతతో పాటు బలమైన ఆహారం తీసుకోవా లని, వర్షాకాలం కాబట్టి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఎటు వంటి ఆరోగ్య సమస్య తలెత్తిన వైద్య ఆరోగ్య సిబ్బందిని సంప్రదించా లని తెలిపారు. పరిసరాలు ఎప్పు డూ పొడిగా ఉంచుకుంటూ మురికి కాలువలు,నీటి తొట్టెలు, పాత్రలు శు భ్రంగా ఉంచుకోవా లని తెలిపారు. తడిగా ఉండే ప్రదేశంలో బ్లీచింగ్ పౌడర్ జల్లు కోవాలని, దోమతెరలు వాడాలని తెలిపారు. అనంతరం రక్త నమూనాలను సేకరిం చారు. ఈ కార్యక్రమం లో ఎంపిడిఓ రాణమ్మ .మండల వైద్యాధికారి కల్పనా రెడ్డి, సిహెచ్ఓ రామ చంద్రారెడ్డి సూపర్వైజ ర్లు సుధాకర,రెడ్డమ్మ , ఆశాకార్యకర్తలు ,ప్రజలు పాల్గొన్నారు.



# వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్లో కేటాయింపులు..

## - బిజెపి కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ స్టేట్ కన్వీనర్ చింత శరత్ కుమార్ రెడ్డి



**కదిరి, మేజర్ న్యూస్:** వికసిత్ భారత్ లక్ష్యం గా బడ్జెట్లో కేటాయిం పులు జరిగాయని, ప్రధానంగా నిరుద్యో గులు, రైతులు, గ్రామీణాభివృద్ధి కోసం అధిక ప్రాధాన్యతను ఇచ్చి బడ్జెట్లో తగిన నిధుల కేటాయింపు లు చేశారని, బిజెపి కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ స్టేట్ కన్వీనర్ చింతా శరత్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రధా నంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలో అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా 9 ప్రాధాన్య అంశాలను ఎంపిక చేసుకుందని, వ్యవసాయ రంగంలో ఉత్పాదక, ఉద్యోగ కల్పన నైపుణ్య అభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన ఆవిష్కరణ లు, తయారీ -సేవలు లాంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుం దన్నారు. ముఖ్యంగా యువత కోసం ఐదు పథకాలతో పీఎం ప్యాకేజీ తీసుకువచ్చిందని, ఈ బడ్జెట్లో యువ తపై కేంద్ర ప్రభుత్వం ఎక్కువ ఫోకస్ పెట్టిందన్నారు. విద్యా ఉపాధి కల్పన నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించిందని, దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయలను ఇందుకోసం కేటాయిం చిందన్నారు. ఉపాధి రంగం ఏదైనా తొలి వేతనం కింద రూపాయలు 15,000 నగదు బదిలీ జరిగే విధంగా చర్యలు తీసుకోవడం సంతోషకరమన్నారు. విద్యార్థులకు ఆర్థికంగా తోడ్పాటును అందించడానికి , ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల కోసం రూపాయలు 10 లక్షల వరకు ఎడ్యుకేషన్ లోన్ ఇవ్వడం, ముద్ర లోన్ పరిమితి రూపాయలు 20 లక్షల పెంపు చేయడం హర్షణీయమన్నారు. అలాగే వ్యవసాయానికి అనుబంధ రంగాల కోసం రూ. 1.52 లక్షల కోట్లు కేటాయించారని , వచ్చే రెండేళ్లలో కోటి మంది రైతులు ప్రకృతి సేద్యాన్ని చేసేలా చర్యలు చేపట్టడం, . గ్రామీణాభివృద్ధి కోసం రూ. 2.66 లక్షల కోట్లు కేటాయించడం శుభ పరిణామన్నారు. మహిళలకు, బాలికల కు లబ్ధి చేర్చే పథకాల కోసం మూడు లక్షల కోట్లు , గృహ నిర్మాణానికి రూ. 2.2 లక్షల కోట్లు , మౌలిక సదుపాయాల కోసం రు. 11.11 లక్షల కోట్లు, కోటి గృహాలు ప్రతి నెల 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందేందుకు ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన , 100 నగరాల్లో పారిశ్రామిక పార్కుల ఏర్పాటు, మహిళల ఆస్తుల రిజిస్ట్రేషన్ పై స్టాంప్ డ్యూటీల తగ్గింపు, ఐదేళ్లలో కోటిమంది యువతకు ప్రయోజ నం చేకూర్చే ఇంటర్న్ షిప్ పథకం , ప్రధాన మంత్రి అన్నా యోజన మరో ఐదేళ్ల పొడిగింపు లాంటి అనేక అంశాల కు బడ్జెట్లో ప్రాధాన్యతని ఇచ్చార ని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ లకు ఆయన ధన్య వాదాలు తెలియజేశారు.

జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గ దర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే
మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి
చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం..
మరింత సమాచారం అందించాల్సిన
వారు ఎప్పు డైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా
తెలియజేయాలని, ఎల్లవేళలా అందుబాటులో
ఉంటామని తెలియజేస్తున్నాం.
ఉమ్మడి అనంతపురం జిల్లాల
బ్యూరో అండ్ బ్రాంచ్ మేనేజర్
ఎన్. లక్ష్మీనారాయణ
ఫోన్ నెంబర్ : 63011 07116

# ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడింది

## -మంత్రి సత్యకుమార్ యాదవ్



ధర్మవరం మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ అబివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం సాయంత్రం 'పత్రికా ప్రకటన విడుదలచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల రాజదాని నిర్మాణం కోసం స్పెషల్ సపోర్టింగ్ కింద కేంద్ర బడ్జెట్లో ఈ ఏడాదికి రూ. 15వేల కోట్లుకేటాయించిన ప్రదానమంత్రి నరేంద్రమోది, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కు మంత్రి సత్యకుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అవసరాన్ని బట్టి మరిన్ని నిదులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్థికశాఖ మంత్రిప్రకటించడం ఆంధ్రప్రదేశ్ అబివృద్ధికి కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వవస్తీకరణ చట్టం అమలుకు కేంద్రం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ బడ్జెట్ ద్వారా మరోసారి వెల్లడైంది. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవధార పోలవరం ప్రాజెక్టు పూర్తీ చేయడానికి చిత శుద్దితో కృషిచేస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని మంత్రి అన్నారు. అలాగే రాయలసీమ, ప్రకారం, ఉత్తరాంధ్రలోని వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీకింద నిధులు అందించడం ఆ ప్రాం తాల అభివృద్ధికి దోహదచేస్తుందన్నారు.

# చంద్రబాబుతోనే అభివృద్ధి...!

## - కేంద్రం ప్రత్యేక ప్యాకేజీతో రాష్ట్రానికి మేలు

## - టిడిపి జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజనప్ప



హిందూపురం మేజర్ న్యూస్ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజనప్ప పేర్కొన్నారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ పలు హామీలు ఇవ్వడంపై అంజనప్ప హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంజన్నప్ప మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని గాలికి వదిలి కేసుల నుండి బయట పడేందుకు కేంద్రం వద్ద రాష్ట్ర అభివృద్ధి ప్రస్తావని తీసుకు రాలేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కి ప్రత్యేక ప్రాజెక్ట్ అదేవిధంగా అన్ని ప్రాంతాల, అన్ని రంగాల అభివృద్ధికి కేంద్రం నుంచి భారీగా నిధుల ను చంద్రబాబు నాయుడు రాబట్టాడన్నారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి కేటాయించిన నిధులు రాష్ట్ర అభివృద్ధి చాలా ఉపయోగపడుతుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్యలో కింది మండలాల్లో
పనిచేయుటకు ఉత్సాహవంతులైన,
యువకులు విలేకరులుగా కావలెను.
మడకశిర రూరల్, అమరాపురం, అగళి,
గుడిబండ

# పూలకుంట్లపల్లిలో ఆధార్ ప్రత్యేక శిబిరాలకు విశేష స్పందన



అమడగూరు, మేజర్ న్యూస్ :మండల పరిధిలోని పూలకుంట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆధార్ ప్రత్యేక శిబి రాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిం చింది. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు పథకాలకు ఆధార్ తప్పనిసరి పెట్టడంతో ఇదివరకు ఆధార్ కార్డు పొందన వారు, 0.5 సంవత్స రాల చిన్నారులు కు కొత్తగా ఆధార్ నమోదు చేసుకునేం దుకు పూలకుంట్లపల్లి పంచాయతీ పరిధి లోని అన్ని అంగన్వా డి కేంద్రాల్లో ఉన్న చిన్నారులతోపాటు, ఆధార్ అప్డేట్, ఇంటి పేరు మార్పు, వంటి వంటి వారు ఆధార ప్రత్యేక శిబిరాలకు హాజరైనట్లు ఎంపీడీ అశోక్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ అశోక్, వీఆర్వో మహేంద్ర స్వామి, ఏఎన్ఎం విజయ్ కుమారి, మాధవి లత, వెల్ఫేర్ అసిస్టెంట్ సుధాకర్ రెడ్డి, అంగన్వాడి కార్యకర్తలు అశ్విని, అరుణ జ్యోతి, వార్డ్ మెంబర్ సరస్వతి, చిన్నారులు, తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు. నేడు తుమ్మల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధార్ ప్రత్యేక శిబిరాలు మండలంలోని తుమ్మల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేడు( బుధవారం) ఆధార్ ప్రత్యేక శిబిరా లు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి మంగ ళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం తుమ్మల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధార ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తు న్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ శిబిరాలకు ఇదివరకు ఆధార్ నమోదు చేయించుకొని వారు, ఐదు సంవత్సరాల లోపల చిన్నారులకు ఆయా అంగన్వాడి కేంద్రాల పరిధిలో ఉన్న చిన్నారులను ఆధార్ ప్రత్యేక శిబిరాలకు హాజరయ్యే విధంగా సంబంధిత అధికా రులు కృషి చేయాలని ఆధార ప్రత్యేక శిబిరాలను సద్విని యోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

# పుట్టపర్తిలో అండర్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించండి..

## - ఎమ్మెల్యే పల్లె సింధూర

పుట్టపర్తి మేజర్ న్యూస్: శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రంలో అండర్ డ్రైనేజీ సిస్టం లేక రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోందని ఈ ప్రాంతంలో సత్వరమే అండర్ డ్రైనేజీ నిర్మాణానికి అవసరమయ్యే నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర కోరారు. మంగళవారం జరిగిన శాసనసభ సమావేశాల్లో పుట్టపర్తి నియోజక వర్గ సమస్యలతో పాటు పుట్టపర్తి నగరంలో ప్రవహిస్తున్న మురుగు నీరు కలుషితంపై ఈ సందర్భంగా పల్లె సింధూర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. సత్యసాయిబాబా నడయాడిన ప్రాంతమైనపుట్టపర్తి ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమని,ఇక్కడికి దేశ విదేశాల నుంచి అనేకమంది భక్తులు విచ్చేస్తుంటారని ఇలాంటి ప్రాంతంలో మురుగునీరు నడిరోడ్లపై ఏరులై పారుతోందని ఆమె పేర్కొన్నారు. అండర్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రభుత్వం చొరవచూపి నిధులు కేటాయించాలని ఏపీఅసెంబ్లీ స్పీకర్ ద్వారా రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర ప్రత్యేకంగా కోరారు. చిత్రావతి నదిలోకి మురికి నీరు



కలుషితం అవుతోందని వీటి నివారణకు ప్రత్యేక నిధులు ఇచ్చి ఆదుకోవాలని ఆమె కోరారు. దీనిపై మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే కోరిక మేరకు వెంటనే ప్రతిపాదనలు పంపితే వాటికి ప్రభుత్వం నుంచి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

# కేంద్రబడ్జెట్లో ఏపీకి తొలిసారి భారీ ప్రాధాన్యత



అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ : రాష్ట్ర విభజన తరువాత ఏపీకి కేంద్ర బడ్జెట్లో పెద్ద ఎత్తున నిధులు రావడంతో ఇదే తొలిసారి అని, ఎన్డీఏ కూటమిలో చేరడంతోనే అది సాధ్యమైందని టిడిపి ఆత్మకూరు మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాన మంత్రి మోడీ,కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించిన ఆర్థిక బడ్జెట్ కూటమి విజయమన్నారు. ఏపీకి ఇంత పెద్ద ఎత్తున ప్రాధాన్యత దక్కడం వెనుక చంద్రబాబంటే కృషి ఉందన్నారు.ఇందుకు నిదర్శనమే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ కేంద్ర బడ్జెట్లో ఏపీకి ప్రకటించిన ప్యాకేజిలు చూస్తే తెలిసిపోతుందన్నారు. అమరావతి కేంద్ర నిర్మాణానికి రూ. 15 వేల కోట్లు కేటాయింపు హర్షించదగ్గ విషయం అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వ్యూహాత్మకంగా ఎన్డీఏలో చేరడం, చంద్రబాబు కేంద్రంలో కీలక పాత్ర పోషించడం, తను మార్పు రాజకీయ మార్క్ మలుచుకోవడం కేంద్రం ప్రతిపాదించిన బడ్జెట్ కు నిదర్శనమని ఆయన అన్నారు. బడ్జెట్లో ప్రాధాన్యత కల్పిండంపై టిడిపి నాయకులు సంబరాలు జరుపుకుంటున్నారని తెలిపారు.

# 48గంటల్లో హత్య కేసును ఛేదించిన పోలీసులు

-హత్య కేసులో నలుగురు ముద్దాయిలు అరెస్ట్.. కోర్టుకు తరలింపు
ఆస్తి తగాదాలతోనే హత్య చేశామన్న ముద్దాయిలు
-ధర్మవరం ఇంచార్జ్ డి.ఎస్.పి బాజీ జాన్ సైదా



**ధర్మవరం టౌన్, మేజర్ న్యూస్ :** ధర్మవరం మండలం వెల్దుర్తి గ్రామంలోని ఆటో డ్రైవర్ తాడిమర్రి సూర్యనారాయణ హత్య కేసును రూరల్ పోలీసులు 48 గంటల్లో కేసును ఛేధించారు. ఈ సందర్భంగా ధర్మవరం ఇంచార్జ్ డి.ఎస్.పి (పెనుకొండ డిఎస్పి) బాజీ జాన్ సైదా ప్రెస్ మీట్ లో పలు వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ మృతుడు ధర్మారం మండలం వెల్దుర్తి గ్రామంలో అత్తగారింట్లో ఇల్లరికం ఉంటూ ఆటో డ్రైవర్ వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడని తెలిపారు. ఫిర్యాది తల్లి సాలమ్మకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు సంతానముగా ఉన్నారని, సుమారు 23 సంవత్సరాల కిందట కూతురు కృష్ణవేణిని తాడిమర్రి కి చెందిన సూర్యనారాయణ (మృతుడు) కు వివాహం కాగా, మూడు సంవత్సరాల తర్వాత ఫిర్యాదురాలు తన భర్త సూర్యనారాయణ తల్లి సాలముతో పాటు కలిసి వెల్దుర్తి గ్రామములో కాపురం ఉంటున్నారని తెలిపారు. సాలమ్మ భర్త చనిపోగా మొత్తము ఆస్తి శాలమ్మ పేరుమీద మార్చబడినదని, ఈ ఆస్తి గురించి చాలమ్మా చిన్న కొడుకు మల్లికార్జున కు కూతురు కృష్ణవేణి కుటుంబానికి మధ్య భూమి విషయములో తగాదాలు ఉండేవని తెలిపారు. తరచూ రెండు కుటుంబాలు గొడవ పడుతూ ఉండేవారని, సుమారు వారం రోజుల క్రితం మృతుడు సూర్యనారాయణ ఆస్తి గురించి మల్లికార్జునతో ఆస్తి జోలికి వస్తే, తనను చంపుతానని బెదిరించడం జరిగిందని తెలిపారు. అందుకు భయపడిన మల్లికార్జున ఆస్తి ఎలాగైనా దక్కించుకోవాలంటే తన బావ సూర్యనారాయణ ను (మృతుడు) చంపాలని నిర్ణయించుకొని పథకం వేశారు అని తెలిపారు. ఈ పథకం ప్రకారం మల్లికార్జున కొడుకు రాము, అల్లుడు రాజు, సమీప బంధువైన లక్ష్మీనారాయణతో కలిసి, ఈనెల 19వ తేదీ రాత్రి సుమారు 10 గంటలకు, వెల్దుర్తి క్రాస్ వద్ద కాపు కాచి, మృతుడైన సూర్యనారాయణ తన ఆటోలో అక్కడికి రాగా, అతనిని చంపాలనే ఉద్దేశంతో పై వారందరూ మాట్లాడుదామని మృతుడిని మభ్యపెట్టి తన ఆటో తోపాటు ధర్మవరం మండలం సీసీ కొత్తకోట గ్రామ శివారులలో ధర్మవరం-కొత్తచెరువు బీటీ రోడ్డు నుండి రోడ్డుకి తూర్పు వైపున ఉడతరాల డీసీ పొలం వద్దకు తీసుకొని వెళ్లి, ఇనుప రాడ్తో ఆటోలో ఉన్న మృతుడు సూర్యనారాయణ మీద దాడి చేసి, కింద పడేసి కొట్టి, చనిపోయిన తర్వాత వారందరూ పారిపోవడం జరిగిందని తెలిపారు. ఇటీవలే జిల్లా ఎస్పీ రత్నం నేర స్థలాన్ని కూడా పరిశీలించడం జరిగిందని తెలిపారు. తదుపరి ఎస్పీ రత్నం ధర్మారం ఇన్చార్జ్ డిఎస్పి బాజీ జాన్ సైదా ఆధ్వర్యంలో రూరల్ సిఐ ఆరోహణరావు, రూరల్ ఎస్సై నరేంద్ర, తన సిబ్బందితో టీమును ఏర్పాటు చేసి ఈనెల 22వ తేదీ ఉదయం 11 గంటలకు ధర్మవరం మండలం పోతుల నాగేపల్లి క్రాస్, ధర్మవరం-పుట్టపర్తి రోడ్డు వద్ద నలుగురు ముద్దాయిలైన మల్లికార్జున-వెల్దుర్తి గ్రామం, రాము-వెల్దుర్తి గ్రామం, రాజు-గోరంట్ల గ్రామం, ప్రెసిడెంట్ ఆఫ్ అనంతపురం మున్నా నగర్, లక్ష్మీనారాయణ-చిన్నపరెడ్డి పల్లి గ్రామం చెన్నై కొత్తపల్లి మండలం అను ముద్దాయిలను (నలుగురు) అరెస్టు చేసి, వారి వద్ద నుండి మృతుడి సెల్ ఫోనును, హత్యకు ఉపయోగించిన రాడును, ఆటోను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కేసును 48 గంటల్లో చేదించిన రూరల్ సీఐ ఆరోహణరావును, ఎస్సై నరేంద్రను, రూరల్ స్టేషన్ సిబ్బందిని ఇన్చార్జి డిఎస్పి అభినందించి, అవార్డు కొరకు ఎస్పీ గారికి తెలుపుతామని తెలిపారు.

# కేంద్రవార్షిక బడ్జెట్.. ప్రజా శ్రేయస్సు, సంక్షేమ బడ్జెట్

- జిఎం శేఖర్




**గోరంట్ల, మేజర్ న్యూస్ :** మంగళవారం కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్ ప్రజా శ్రేయస్సు ప్రజా సంక్షేమ బడ్జెట్ గా అభివర్ణిస్తున్నామని జిఎం శేఖర్ తెలిపారు. ఈ బడ్జెట్లో రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమానికి కేంద్రం పెద్ద ఎత్తున నిధులు కేటాయించినందుకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఇళ్లు లేని వారికి కేంద్రం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద మరో 3కోట్ల ఇళ్లు నిర్మించనున్నట్లు ప్రకటించటం చాలా సంతోషించదగ్గ విషయం. పట్టణాల్లో కోటి ఇళ్ల నిర్మాణాలు చేపడతామని స్పష్టం చేసింది. ఇందుకు గాను బడ్జెట్లో అర్బన్ హౌసింగ్ కోసం రూ.2.2లక్షల కోట్లను కేటాయించినట్లు తెలిపింది. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు ప్రత్యేక సాయం అవసరాన్ని బట్టి భవిష్యత్తులో అమరావతికి మరిన్ని అదనపు నిధులు కేటాయిస్తామని కేంద్రం ప్రకటించటం హర్షణీయం. ఏపీ విభజన చట్టానికి అనుగుణంగా పోలవరం సత్వర నిర్మాణానికి సంపూర్ణ సాయం పోలవరానికి కావాల్సిన నిధులు కేటాయింపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, రైతులకు జీవనాడి పోలవరం భారత ఆహార భద్రతకు పోలవరం ఎంతో కీలకమైంది. , హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు, కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల అభివృద్ధికి నిధులు. విశాఖ-చెన్నై కారిడార్లో కొప్పర్తికి, హైదరాబాద్-బెంగళూరు కారిడార్, రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు ఏపీ విభజన చట్టంలో పేర్కొన్న మేరకు వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయించటం జరిగిందన్నారు. బీజేపీ సత్యసాయి జిల్లా తరపున కేంద్ర ప్రభుత్వానికి ప్రధాని నరేంద్ర మోడీకు అదేవిధంగా రాష్ట్రా భివృద్ధి కొరకు కేంద్ర పెద్దలతో మాట్లాడి అత్యధిక నిధులు తీసుకోరావటం కోసం విశేష కృషి చేసిన నవ్యాంధ్ర నిర్మాత ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడుకు ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్కు అదేవిధంగా మన రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి వర్యులు, బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్కి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు.

# ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాల పోస్టర్ల ఆవిష్కరణ



**ఉరవకొండ, మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా భారత విద్యార్థి సమాఖ్య అలుపెరుగని పోరాటం చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధార్థ్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మస్తాన్ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగే 32వ ప్లీనరీ సమావేశాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతపురం జిల్లా ఉరవకొండ కేంద్రంగా ఆగస్టు 6, 7వ తేదీల్లో ఎస్ఎఫ్ఐ 32వ ప్లీనరీ సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ సమావేశానికి పెద్ద ఎత్తున తరలి రావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ సామాజిక అంశాలు, విద్యార్థుల సమస్యల పట్ల ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటం కొనసాగిస్తున్నట్లు గుర్తు చేశారు. ఉరవకొండ విద్యారంగంలో నెలకొన్న అనేక సమస్యల పరిష్కారానికి దశలవారీగా పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఉరవకొండ పట్టణంలో ఐటిఐ కళాశాలకు నూతన భవనం ఏర్పాటు చేయాలని, చిన్న ముష్టూర్ మోడల్ స్కూలు కు శాశ్వత రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నట్లు కోరారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో ముఖ్యంగా బాలికల వసతి గృహాల్లో మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్, నందు, అశోక్, హర్ష, సాయి పాల్గొన్నారు.

# తిప్పేపల్లిలో ఘనంగా మొహరం ఉత్సవాలు



**ధర్మవరం మేజర్ న్యూస్:** ఫ్యాక్షన్ గ్రామమైన తిప్పేపల్లి గ్రామంలో ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా కులమతాలకు అతీతంగా మొహరం ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. మంగళవారం మేళాలు,తప్పెట్లు,ధ్వనులతో,గ్రామ ప్రజలు, చుట్టుపక్కల గ్రామ ప్రజలు తరలి వచ్చి ,పెద్దకాశిం స్వామి,చిన్నకాసిమ్ స్వామి, ఉజ్జినప్ప స్వామి,బాబయ స్వామి,ఉసేన్ కట్టి ,స్వాములు,"జెలిది" కార్యక్రమంలో కి వెళ్లడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, గ్రామ పిన పెద్ద ఎంకేకలువ.సుదర్శన్ రెడ్డి, గ్రామ పెద్దలు,చిట్టిబాల. వెంకటనారాయణరెడ్డి, ఆదినారాయణ రెడ్డి,ముక్తపురం. చిన్నవెంకటరెడ్డి, పిక్కిలి.లక్మినారా యన్ వెంకటరమణ రెడ్డి, హనుమంతారెడ్డి, లక్ష్మీనారాయణ,నాగభూషణం, రమణారెడ్డి, వెంకటరామిరెడ్డి, గోపాల్ రెడ్డి, శివారెడ్డి, చిన్నకేసప్ప,వెంకటేశ్, నారాయణ రెడ్డి, కృష్ణరెడ్డి,.నారాయణ స్వామి, సంజీవరాయుడు, ముల్లాసావ్ భాష,కాశిం, తదితరులు పాల్గొన్నారు.

# సిసి హరిని సన్మానించిన మీడియా మిత్రులు



**సోమందేపల్లి, మేజర్ న్యూస్ :** మండల తొగటవీర క్షత్రీయ సేవా సమితి కమిటికి ఇటీవల అద్యక్షుడిగా ఎన్నికైన మాస్టర్ వీవర్ సిసి హరిని మంగళవారం ఆయన నివాసంలో మీడియ సోదరులు కలిసి సన్మానించి అభినందనలు తెలియజేశారు. అందరి ఐక్యతతో కుల అభివృద్ధితో పాటు గ్రామాభివృద్ధి వైపున కూడా దృష్టి సారించాలని సూచించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా లక్ష్మీకాంత్, మురళి, అరుణ్ కుమార్, మధు, సురేష్, చరణ్, హరినాథ్ రెడ్డి ఉన్నారు.

# రైలు ప్రయాణికులకు ఇబ్బందులు




**సోమందేపల్లి, మేజర్ న్యూస్ :** మండలంలోని రంగేపల్లి రైల్వే స్టేషన్లో రైలు ఎక్కే ప్రయాణికులకు టికెట్ బుకింగ్ లేకపోవడంతో ఇబ్బందులకు గురికావడం జరుగుతోందని పలువురు ప్రయాణికులు మేజర్ న్యూస్తో వాపోయారు. రైల్వే స్టేషన్ మాస్టర్ను వివరణ అడగగా ఈ నెల 1వ తేదీ నుండి రైల్ టికెట్ బుకింగ్ ఆపేసామని రైల్లో ప్రయాణించే ప్రయాణికులు ఆన్లైన్లో బుకింగ్ చేసుకోవాలని తెలుపుతున్నట్లు వివరించారు. ఏది ఏమైనా స్టేషన్కు వెళ్లి టికెట్ కొని ప్రయాణం చేస్తామనుకున్న ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అందుకోసం రైల్వే పై అధికారులు స్పందించి స్టేషన్లోనే ట్రైన్ టికెట్ పొందటానికి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# సిఐటియు మండల కమిటీ ఎన్నిక



గోరంట్ల, మేజర్ న్యూస్ : గోరంట్ల మండల కేంద్రంలో మాధవ రాయ గుడి ఆవరణలో సీఐటీయూ మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు పెడబల్లి బాబా హాజరైయ్యారు. వారి ఆధ్వర్యంలో సిఐటియు మండల కమిటీ ఎన్నికలో భాగంగా కన్వీనర్గా కమల్ భాష, కో కన్వీనర్గా గంగాధర్ ను పదిమంది కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోరంట్ల మండలంలో ఉన్నటువంటి కార్మికులను ఐక్యం చేసి వారి సమస్యలు పరిష్కారం దిశగా పోరాటంలో ముందుండి కార్మికులకు అండగా ఉండి ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని కార్మికులకు సీఐటీయూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, రాము, ఈశ్వరమ్మ, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు నాగజ్యోతి, పద్మ, ఆటో యూనియన్ నాయకులు వల్లి భాష, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయింపు హర్షనీయం : ఎంఈఎఫ్




అనంతపురము రూరల్ మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం కోసం కేంద్ర బడ్జెట్ ద్వారా రూ.15వేల కోట్లు కేటాయించడం హర్షనీయమని మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) జాతీయ ఆదనపు ప్రధాన కార్యదర్శి బందారు శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. గంగాధర్ పేరొన్నారు. బుధవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దేశంలోని ఉద్యోగుల ప్రయోజనం కోసం ఆదాయపు పన్ను విధానంలో శ్లాబ్ లను మార్పు చేసి, ఉద్యోగులకు ఊతం కల్పించారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సమన్వయంతో కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం తరపున చేసిన ప్రాతినిధ్యాల ఫలితంగానే ఆంధ్ర ప్రదేశ్ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందన్నారు. అందరికి అమోదయోగ్యమైన బడ్జెట్‌పై భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు అమర్ నాథ్, జిల్లా అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి అశోక్ , జిల్లా కోశాధికారి పుల్లన్న, నగర అధ్యక్షులు నాగభూషణ పాల్గొన్నారు.

## దొన్నికోటలో జల్ జీవన్ మిషన్‌పై గ్రామ సభ



నల్లమాడ, మేజర్ న్యూస్ : మండలంలోని దొన్నికోట గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ రాగినేని సరస్వతి అధ్యక్షతన జల్ జీవన్ మిషన్ ఓడిఎఫ్ పై గ్రామసభను నిర్వ హించారు. ఈ సమావేశంలో జల్ జీవన్ మిషన్, స్వచ్ఛభారత్, హర్గర్ జెల్ పై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. గ్రామపంచాయతీ కి వీటి ద్వారా వచ్చిన నిధులు పనులను ప్రజలకు తెలియజేశారు. పై వాటిని యుద్ధ ప్రాతిపదికన అమలు చేసి అన్ని గ్రామాలు వంద శాతం హర్ ఘర్ జెల్ సాధించటానికి అందరు కృషి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పిఎస్ రామమోహన్, వై సి గంగులప్ప నాయుడు, చంద్రప్ప, డి.రామప్ప, ఏ. గంగులప్ప, మహమ్మద్, జయశంకర్, సచివాలయ ఉద్యోగులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వర్షం కోసం బోనం పండుగ



బుక్కరాయసముద్రం మేజర్ న్యూస్: మండల పరిధిలోని రేకలకుంట గ్రామంలో మంగళవారం వర్షం కోసం పోతలయ్య స్వామికి బోనం పండుగ నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ఇంటింటికి బోనం తో గ్రామ ప్రజల ఆధ్వర్యంలో డప్పు లతో ఊరేగింపు నిర్వహించారు. గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి కొలహాలంగా పండుగను జరుపుకున్నారు. కాలినడకన స్వామివారికి గుడికి చేరుకొని వర్షాలు కురవాలని గ్రామ ప్రజలు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమం లో గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం క్రైం, మేజర్ న్యూస్ : నగరంలోని రాణి నగర్ కు చెందిన ఖాదర్ భాషా (30) అనే వ్యక్తి మంగళవారం రాత్రి తన ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. నగరంలోని రాణి నగర్ లో ఉన్న గుజిరి షాపులో హమాలీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టి వాటికి సంబంధించి అధిక అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపం చెంది మంగళవారం రాత్రి తన ఇంటిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. అతనిని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సంఘటనకు సంబంధించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## కేంద్ర బడ్జెట్‌తో వేతన జీవులకు నిరాశ : యుటిఎఫ్





కదిరి, మేజర్ న్యూస్ : కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్సభ నందు ప్రవేశపెట్టిన బడ్జెట్ లో వేతన జీవులకు మళ్లీ నిరాశ మిగిల్చింది. పాత పన్నుల విధానం లో ఎలాంటి మార్పులు చేయకుండా, కొత్త పన్నుల విధానంలో మాత్రమే మార్పులు చేయడం వల్ల వేతన జీవులకు ఎలాంటి ఊరట కలగలేదని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి. శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు సి. తాహేర్ వలి, వై.వి .సుబ్బారెడ్డి, సునీల్ కుమార్, మల్లికార్జున, ఆజం భాషలు తెలిపారు. సిపిఎస్ విధానంలో మార్పులు చేస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానం పై ఒక్క మాట బడ్జెట్లో లేక పోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశ కలిగించింద న్నారు. ఉద్యోగులు ఆదాయపు పన్ను కు సంబంధించి పాత విధానం కంటే కొత్త విధానంలో పన్ను ఎక్కువగా చెల్లించాల్సి రావడం ఉద్యోగులు పాత విధానానికి మొగ్గు చూపుతున్నా రు. ఈ దఫా అయిన పాత విధానంలో పన్నులు చెల్లించే వారికి రాయితీ ఇస్తా రని అందరూ ఆశించా రు. కానీ నిరాశనే మిగులుస్తూ మరోసారి కొత్త పన్నుల విధానానికి రాయితీలు ప్రకటించడం ఉద్యోగులను తీవ్ర ఆగ్రహ వేషాలకు గురి చేసే విధంగా ఉందన్నారు. ముఖ్యంగా విద్యారం గానికి బడ్జెట్ కేటాయింపులో కేవలం 3.25 శాతం నిధులను మాత్రమే కేటాయించి ప్రభుత్వ విద్యారంగం కు ప్రాధాన్యత లేదన్నట్లు ప్రభుత్వం వ్యవహరించింది. ద్రవ్యోల్బణం 4 శాతం తగ్గిందని బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ చెప్పారన్నారు. కానీ దానికి అనుగుణంగా ధరలు తగ్గకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. ఇప్పటికైనా మధ్యతరగతి ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రభుత్వం తక్షణం పాత పెన్షన్ పునరుద్ధరించి, దానిపై ఒక స్పష్టమైన విధానాన్ని ప్రకటిం చాలి. పన్నుల స్లాబ్ విధానాన్ని సవరించాలన్నారు. కనీసం లక్ష రూపాయల స్టాండర్డ్ డిటెక్షన్ గా మినహాయింపులు ఉండాలి.

## శిక్షా సప్తాహ్' కార్యక్రమం..



**చెన్నై కొత్తపల్లి , మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో మంగళవారం నాడు మండల విద్యాధికారులు పలు పాఠశాలలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వనరులతో బోధన అభ్యసన సామాగ్రి తయారు చేసి ప్రదర్శించటం, పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర కృత్యాలు , పాఠశాలలో పోషణ దినోత్సవ నిర్వహణ, పాఠశాలల్లో కొత్త లిఎకో క్లబ్‌ల ఏర్పాటు,లి విద్యార్థులు, వారి తల్లులు మరియు మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి లిలిఅమ్మ పేరుతో అమ్మతో కలిసి మొక్కలు నాటి అమ్మకి అంకితం కార్యక్రమం కింద కనీసం 35 మొక్కలు తల్లి బిడ్డల తో కలిసిలి నాటించడం.

**సామాజిక భాగస్వామ్య దినోత్సవం.**

విద్యార్థుల సామాజిక భావోద్వేగ శ్రేయస్సు కోసం స్థానిక ప్రజలు, తల్లిదండ్రుల కమిటీలు, తల్లిదండ్రులు ఉపాధ్యాయ సంఘాలతో సహకారాన్ని పెంపొందించడం మరియు నైపుణ్యాభివృద్ధికి పర్యావరణ వ్యవస్థను అందించడం (పుట్టిన రోజులు మరియు ప్రత్యేక సందర్భాలలో (తిథి భోజనాలు) లిపాఠశాల విద్యార్థిని విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం. ఈ కార్యక్రమాలకు సంబంధించి కార్య నిర్వహణ, అమలు పరచే కార్యక్రమం లిశిక్షా సప్తహలి కార్యక్రమాన్ని భాగంగా రెండో రోజు భాగంగా కస్తూరి బాలికల విద్యాలయాన్ని మండల విద్యాధికారులు మున్వర్ భాష, ప్రసన్నకుమార్ నాయుడు పర్యవేక్షించారు.

## కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అత్యధిక నిధులు

### – బిజెపి జిల్లా గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్ యాదవ్ హర్షం



**తాడిపత్రి మేజర్ న్యూస్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో మంగళవారం జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్ కు ఇచ్చిన అత్యధిక కేటాయింపులకు భారతీయ జనతా పార్టీ జిల్లా గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు .బడ్జెట్ సమావేశాల్లోలో అమరావతికి రూ.15వేల కోట్ల ప్రత్యేక సాయం,ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టానికి మాప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ ఆర్థిక సంవత్సరంలో అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు ప్రత్యేక సాయం అవసరాన్ని బట్టి అమరావతికి మరిన్ని నిధులుపోలవరానికి పెద్దపీట త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషిచేయడం పై అభినందనలు తెలిపారు . వెనుకబడిన జిల్లాలైన రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు, విశాఖ– చెన్నై కారిడార్లో కొప్పర్తికి, హైదరాబాద్, బెంగళూరు కారిడార్లో ఓర్వకల్లుకు నిధులు కేటాయించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి,ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.